



# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 37, పేజీలు - 08

శుక్రవారం, జులై 11, 2025 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati







## వచ్చే 100 ఏళ్ల వరకు

ప్రోగ్రామర్లను ఏఐ భర్తీ చేయలేదు

2లో..



## హెచ్‌సీఏ అధ్యక్షుడు

జగన్మోహన్ రావుకు రిమాండ్

2లో..



## షేక్ హసీనాను అప్పగించండి

2లో..



ప్రస్తుతానికి కుర్చీ ఖాళీ లేదు..

## ఐదేళ్లు నేనే సీఎం

2లో..



# తెగదు - తెల్లారదు

## కొండా మురళిపై యాక్షన్ తీసుకుంటారా?

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిపై చర్య తీసుకోవాల్సిందేనని వరంగల్ కు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోరినట్లు తెలిసింది. లేకుంటే తాము ఇలాంటి అవమానాలను ఎదుర్కొనాల్సి ఉంటుందని, ఖచ్చితంగా చర్యలు తీసుకోవాల్సిందేనని పట్టుబడుతున్నారు. కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ ముందు వరంగల్ కు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు హాజరయ్యారు. మాట అనిపించుకుంది తామని, తిరిగి తమనే క్రమశిక్షణ కమిటీ ముందుకు పిలవడమేంటని వరంగల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కమిటీ ఎదుట అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అయితే వాస్తవాలు తెలుసుకోవాలంటే ఇరు పక్షాల వాదనలను ఎవరైనా వినాల్సి ఉంటుందని, సమస్యకు పరిష్కారం కనుగొనాలంటే అందరి వాదనలను వినాల్సిన బాధ్యత కమిటీ మీద ఉంటుందని చెప్పారు.

### తాము కూడా బహిరంగంగానే..

అయితే వరంగల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మాత్రం తాము ఇక ఎక్కువ సమయం ఉపేక్షించలేమని, కొండా మురళి తన ఇష్ట మొచ్చినట్లు మాట్లాడుతుంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తి లేదని తెలిపారు. తాము ఆ నిర్ణయం తీసుకోక ముందే కొండా మురళిపై చర్యలు తీసుకోవాలని, లేదంటే తాము హైకమాండ్ వరకూ వెళ్లి తమ నిరసనను తెలియజేస్తామని క్రమశిక్షణ కమిటీ ఎదుట చెప్పినట్లు తెలిసింది. తమను బహిరంగంగానే దూషించిన కొండా మురళిని అలా వదిలేస్తే ఇక తమను ఎవరు జిల్లాలో లెక్క పెడతారని, తమకు ఫ్రీ హ్యాండ్ ఇస్తే తాము కూడా బహిరంగంగానే కొండా కుటుంబం పై



విమర్శలు చేయడానికి రెడీ గా ఉన్నామని కూడా క్రమశిక్షణ కమిటీ అధ్యక్షుడు మల్లు రవికి చెప్పినట్లు తెలిసింది.

2లో..

## బీసీలకు రిజర్వేషన్ల తర్వాతే

# స్థానిక ఎన్నికలు

- స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రధానంగా చర్చించిన క్యాబినెట్
- బీసీలకు 42 శాతం కోటా అమలుకు మంత్రివర్గం ఆమోదం
- ఇక, రెండు వారాలకు ఒకసారి క్యాబినెట్ భేటీ

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన తెలంగాణ క్యాబినెట్ 'సమావేశం




సుదీర్ఘంగా జరిగింది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు మీడియాకు

2లో..

# మాస్టారుగా మారిన ముఖ్యమంత్రి

- పుట్టపర్తి స్కూలులో చంద్రబాబు పాఠాలు
- విద్యార్థులతో కలిసి పాఠాలు విన్న లోకేష్
- ఏపీలో మెగా పీటీఎం 2.0లో ఆసక్తికర సీన్

**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్‌లో మెగా పీటీఎం 2.0లో ఆసక్తికరమైన సీన్ కనిపించింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ పీటీఎంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్య కమిటీలు, ఉద్యోగులు, అధికారులు, దాతలు, పూర్వ విద్యార్థులు ఇలా అందర్నీ ఒకే వేదికపై తీసుకొచ్చేందుకు ఈ పీటీఎం నిర్వహించింది ప్రభుత్వం. ఈ కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు జడ్పీ పాఠశాలకు వెళ్లారు. అక్కడ తల్లిదండ్రులతో



ముచ్చటించారు. విద్యార్థులతో కలిసి కబుర్లు చెప్పారు. వారి ఆసక్తులు, ఆలోచనలు, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ పీటీఎం కార్యక్రమంలో పాల్గొన్న చంద్రబాబు విద్యార్థులకు పాఠాలు చెప్పారు. సాంఘీశాస్త్ర ఉపాధ్యాయుడిగా మారిన చంద్రబాబు "వనరులు" అనే పాఠాన్ని బోధించారు.

2లో..

## ఇందిరమ్మ ఇళ్లలో ఎంపీలకు

# 40 శాతం కోటా ఇవ్వండి

- రేవంత్ కు రఘునందన్ లేఖ

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో పార్లమెంటు సభ్యులకు కూడా భాగస్వామ్యం కల్పించాలని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు. లబ్ధిదారుల ఎంపికలో ఎంపీలకు 40 శాతం కోటా కేటాయించాలంటూ ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఓ లేఖ రాశారు. ఈ నిర్ణయం ద్వారా పేదలకు మరింత న్యాయం జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యేల మాదిరిగానే ఎంపీలు కూడా ప్రజల చేత నేరుగా ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులని రఘునందన్ రావు

2లో..



# రేవంత్ రెడ్డికి ఎమ్మెల్సీ కవిత సవాల్

- డైవర్షన్ పాలిటిక్స్ వద్దంటూ సెటైర్లు
- కేసీఆర్ అసెంబ్లీకి కాదు, మేమే పోలీస్ కంట్రోల్ సెంటర్‌కి వస్తాము
- ముందు మహిళలకు ఇవ్వాల్సిన రూ.2,500 గురించి మాట్లాడండి
- కొత్తగూడెంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

2లో..



# మయన్మార్‌లో చిక్కుకున్న యువత

- రంగంలోకి దిగిన పవన్ కల్యాణ్



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఉద్యోగాల ఆశతో విదేశాలకు వెళ్లి మానవ అక్రమ రవాణా ముఠాల చేతిలో చిక్కుకున్న తమ బిడ్డలను రక్షించాలంటూ ఓ తల్లి పెట్టిన కన్నీళ్లకు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తక్షణమే స్పందించారు. బాధితులను సురక్షితంగా స్వదేశానికి రప్పించేందుకు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి, తక్షణ చర్యలకు మార్గం సుగమం చేశారు. విజయనగరానికి చెందిన గండబోయిన సూర్యకుమారి అనే మహిళ పవన్ కల్యాణ్‌ను కలిసి తన గోడు వెళ్లబోసుకున్నారు.

2లో..

## ఇందిరమ్మ క్యాంటీన్లలో

# రూ.5కే టిఫిన్

- జీహెచ్ఎంసీ కీలక నిర్ణయం




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** జీహెచ్ఎంసీ హైదరాబాద్ నగరం ప్రజలకు భారీ శుభవార్త తెలిపింది. రూ. 5 కే మిల్లెట్ టిఫిన్ అందించనుంది. ఇడ్లీ, పూరీ, ఉప్మా ఇలా ఏ టిఫిన్ అయినా రూ. 5 కే నగరవాసులకు అందించేందుకు సిద్ధమైంది. ఈ మేరకు హైదరాబాద్ నగర వ్యాప్తంగా ఇందిరమ్మ క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నట్లు జీహెచ్ఎంసీ ప్రకటించింది. జీహెచ్ఎంసీ కీలక ప్రకటన చేసింది. హైదరాబాద్ నగర వ్యాప్తంగా ఇందిరమ్మ క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. ఇందిరమ్మ క్యాంటీన్ల కోసం కొత్త కంటైనర్లు ఏర్పాటు చేస్తున్నట్లు జీహెచ్ఎంసీ పేర్కొంది. నగర వ్యాప్తంగా 139 ప్రాంతాల్లో రూ.11.43 కోట్లతో కంటైనర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. ఈ క్యాంటీన్లలో లంచ్ తో పాటు త్వరలో రూ.5 కే అల్పాహారం

2లో..

# బీహార్ ఓటర్ల జాబితా సవరణపై సుప్రీం డౌట్స్

- కీలక ఆదేశాలు జారీ

**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** బీహార్ లో అసెంబ్లీ ఎన్నికల వేళ కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ తీవ్ర వివాదాస్పదంగా మారింది. ఇందులో భాగంగా ఆధార్ ను కాకుండా మిగతా గుర్తింపు కార్డుల్నే అనుమతిస్తామంటూ

2లో..



# తెలంగాణ మ్యాప్ వివాదం

- తెలంగాణ లేకపోవడపై బీఆర్ఎస్ అభ్యంతరం

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ నారా లోకేష్‌కు బహూకరించిన చిత్రపటం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశమవుతోంది. సోషల్ మీడియా వేదికగా ఏపీ బీజేపీ చీఫ్ చేసిన పనిపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పీవీఎన్ మాధవ్ ఏపీ బీజేపీ చీఫ్‌గా కొత్తగా నియమితులయ్యారు బుధవారం బాధ్యతలు స్వీకరించిన

2లో..



# వచ్చే 100 ఏళ్ల వరకు ప్రోగ్రామర్లను ఏఐ భర్తీ చేయలేదు

### – ఏఐ కేవలం అసిస్టెంట్ మాత్రమేనన్న బిల్ గేట్స్

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) కృత్రిమ మేధ (ఏఐ) రాకతో ఉద్యోగ భద్రతపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్న వేళ, మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రోగ్రామింగ్ ఉద్యోగాలకు వచ్చే వందేళ్ల వరకు ఏఐ నుంచి ఎలాంటి ముప్పు ఉండబోదని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, కృత్రిమ మేధ అనేది ప్రోగ్రామింగ్ రంగంలో మనిషికి ప్రత్యామ్నాయం కాలేదని, కేవలం ఒక సహాయకారిగా మాత్రమే పనిచేస్తుందని అభిప్రాయపడ్డారు. బిల్ గేట్స్ మాట్లాడుతూ, "ప్రోగ్రామింగ్‌లో డీబగ్గింగ్ వంటి కొన్ని బోరింగ్ పనుల్లో ఏఐ మనకు సాయం చేస్తుంది. అంతేగానీ, మన స్థానాన్ని పూర్తిగా భర్తీ చేయదు. క్లిష్టమైన సమస్యలకు సృజనాత్మక పరిష్కారాలు కనుగొనడమే ప్రోగ్రామింగ్‌లో అసలైన సవాలు. యంత్రాలు దానిని చేయలేవు. కోడింగ్‌కు విచక్షణ, ఊహాత్మక ఆలోచనా ధోరణి, పరిస్థితులకు తగ్గట్లు సర్దుబాటు కావడం వంటి లక్షణాలు అవసరం.

ఈ సామర్థ్యాలు ఏఐలో లోపించాయి" అని వివరించారు. కోడింగ్ రాయడం అంటే కేవలం టైప్ చేయడం కాదని, దాని వెనుక లోతైన ఆలోచన, మానవ మేధస్సు ఉంటాయని ఆయన తెలిపారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ అంచనాలపైనా బిల్ గేట్స్ స్పందించారు. 2030 నాటికి ఏఐ వల్ల ప్రపంచవ్యాప్తంగా 8.5 కోట్ల ఉద్యోగాలు పోయే అవకాశం ఉండగా, అదే సమయంలో 9.7 కోట్ల కొత్త ఉద్యోగాలు కూడా సృష్టించబడతాయని ఫోరమ్ పేర్కొంది. ఈ విషయంపై గేట్స్ మాట్లాడుతూ, ఏఐతో ముప్పు పొంచి ఉందనే విషయంలో తనకూ కొంత ఆందోళన ఉందని అంగీకరించారు. అయితే, కృత్రిమ మేధను తెలివిగా వినియోగించుకుంటే మన ఉత్పాదకత పెరగడమే కాకుండా, మరింత ఖాళీ సమయం కూడా లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలోనూ కోడింగ్, ఎనర్జీ మేనేజ్‌మెంట్, బయాలజీ వంటి రంగాలకు ఆటోమేషన్ ముప్పు తక్కువని ఆయన అంచనా వేసిన విషయం తెలిసిందే.

# హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్ రావుకు రిమాండ్

### – కొంపముంచిన సన్‌రైజర్స్ టికెట్ల వ్యవహారం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్మోహన్ రావుతో పాటు మరో నలుగురికి మల్కాజ్‌గిరి కోర్టు జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. హెచ్‌సీఏ అధ్యక్ష ఎన్నికల్లో చోటుచేసుకున్న అక్రమాలపై జగన్మోహన్‌రావుతో పాటు ట్రెజరర్ శ్రీనివాసరావు, సీఈఓ సునీల్, జనరల్ సెక్రటరీ రాజేందర్ యాదవ్, ఆయన భార్య కవితలను సీఐడీ అరెస్ట్ చేసింది. హెచ్‌సీఏ నిధులను దుర్వినియోగం చేసినట్లు తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ధరమ్ గురవారెడ్డి ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన సీఐడీ ఆ తర్వాత వారిని అరెస్టు చేసింది.శ్రీ చక్ర క్రికెట్ క్లబ్ నిర్వహిస్తున్న కవిత జగన్మోహన్ రావకు మద్దతుగా గౌలిపురా క్రికెట్ క్లబ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కృష్ణ యాదవ్ సంతకం ఫోర్జరీ చేశారు. ఆ పత్రాలను ఉపయోగించి జగన్మోహన్‌రావు హెచ్‌సీఏ అధ్యక్షుడయ్యారు.

హెచ్‌సీఏ అధ్యక్షుడు అయిన తర్వాత భారీ మొత్తంలో నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు గురవారెడ్డి ఫిర్యాదు సీబీఐ చర్యలు తీసుకుంది. ఐపీఎల్ 2025 సమయంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంఛైజీ జగన్మోహన్ రావుపై బహిరంగ విమర్శలు చేసింది. ముఖ్యంగా కార్పొరేట్ బాక్స్‌లోని టికెట్ల విషయంలో గందరగోళం నెలకొంది. కాంప్లిమెంటరీ టికెట్ల విషయంలో జగన్మోహన్‌రావు బ్లాక్‌మెయిల్‌కు పాల్పడినట్లు విచారణలో తేలింది. తాము చెప్పినట్లు వినకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని సన్‌రైజర్స్ ఫ్రాంఛైజీని బెదిరించారని సీఐడీ విచారణలో బయటపడింది."ఉచిత టికెట్ల కోసం హెచ్‌సీఏ నుంచి బెదిరింపులు, బ్లాక్‌మెయిల్‌లు వస్తున్నాయి. దాంతో తీవ్ర ఆందోళన చెందుతూ ఈ లేఖ రాస్తున్నాం. 12 సంవత్సరాలుగా హెచ్‌సీఏతో కలిసి చేస్తున్నాం. కానీ గత రెండు సీజన్ల నుంచే ఈ వేధింపులు ఎదురవుతున్నాయి. ఒప్పందం ప్రకారం హెచ్‌సీఏకు 10 శాతం కాంప్లిమెంటరీ టికెట్లు కేటాయిస్తున్నాం. 50 సీట్లున్న ఎఫ్ 12ఏ కార్పొరేట్ బాక్స్ టికెట్లు కూడా అందులో భాగమే. కానీ ఈ ఏడాది అదనంగా మరో బాక్స్‌లో 20 టికెట్లు కేటాయించాలని అడిగారు. మాట్లాడుదాం అని చెప్తే ఎఫ్ 3 బాక్స్‌కి తాళం వేశారు. అదనంగా 20 టికెట్లు ఇస్తే తప్ప తెరవమంటూ బెదిరించారు" అంటూ సన్‌రైజర్స్ మేనేజర్ శ్రీనాథ్ అప్పట్లో లేఖ రాశారు. ఈ లేఖ తర్వాతే జగన్మోహన్‌రావుపై విచారణ మొదలై ఇప్పుడు ఏకంగా కటకటాల వెనక్కి వెళ్లాల్సి వచ్చింది.

# షేక్ హసీనాను అప్పగించండి

### – భారత్‌కు బంగ్లాదేశ్ ప్రభుత్వం మరోసారి విజ్ఞప్తి

ఢాకా (ప్రశ్న న్యూస్) భారత్‌లో ఆశ్రయం పొందుతున్న తమ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనాను వెంటనే తమకు అప్పగించాలని బంగ్లాదేశ్ ప్రభుత్వం మరోసారి విజ్ఞప్తి చేసింది. ఈ విషయంలో భారత్ తన మనస్సాక్షితో వ్యవహరించి సముచిత నిర్ణయం తీసుకోవాలని సూచించింది. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహ్మద్ యూనస్ కార్యాలయం ఈ మేరకు సామాజిక మాధ్యమం ద్వారా ఒక ప్రకటన విడుదల చేసింది. "షేక్ హసీనాను అప్పగించాలని మేం పదేపదే అభ్యర్థిస్తున్నప్పటికీ, భారత్ నుంచి స్పందన కరవైంది. ఈ అంశాన్ని మరింత జాప్యం చేయడం సముచితం కాదు" అని యూనస్ ప్రభుత్వం ఆ ప్రకటనలో స్పష్టం చేసింది. మానవత్వానికి వ్యతిరేకంగా తీవ్ర నేరాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి భారత్ వంటి ప్రజాస్వామ్య దేశం ఆశ్రయం కల్పించడం సబబు కాదని హితవు పలికింది. చట్టం ముందు ఎంతటి శక్తిమంతులైనా సమానులేనని, బాధితులకు న్యాయం జరగాల్సిందేనని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.పౌరులను ఉద్దేశపూర్వకంగా హత్య చేసిన వారిని ప్రాంతీయ బంధాలు లేదా రాజకీయ నేపథ్యం కాపాడలేవని తేల్చి చెప్పారు. చట్టబద్ధ పాలన, ప్రజాస్వామ్య సమగ్రత వంటి ఉమ్మడి విలువల పట్ల భారత్ గౌరవం ప్రదర్శించాలని యూనస్ ఆ ప్రకటనలో కోరారు.

గత సంవత్సరం విద్యార్థుల ఆందోళనల కారణంగా అధికారం కోల్పోయిన షేక్ హసీనా, ఆగస్టు 5 నుంచి భారత్‌లో తలదాచుకుంటున్నారు. నిరసనల సందర్భంగా ఆమె పార్టీ అవామీ లీగ్ మద్దతుదారులు, మైనారిటీ వర్గాలపై దాడులు జరిగాయి. ఈ అల్లర్లలో దాదాపు 1400 మంది మరణించారని ఐక్యరాజ్యసమితి పేర్కొంది. అనంతరం బంగ్లాదేశ్‌లో అధికారంలోకి వచ్చిన యూనస్ ప్రభుత్వం, హసీనాపై హత్యతో సహా పలు కేసులు నమోదు చేసింది. ఇదివరకే ఒక కోర్టు ధిక్కరణ కేసులో అక్కడి అంతర్జాతీయ క్రైమ్స్ ట్రైబ్యునల్ ఆమెకు ఆరు నెలల జైలు శిక్ష విధించింది. ఈ నేపథ్యంలో ఆమెను స్వదేశానికి రప్పించేందుకు బంగ్లా ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోంది.

# ప్రస్తుతానికి కుర్చీ ఖాళీ లేదు.. ఐదేళ్లు నేనే సీఎం

### – ఆ ప్రచారంలో నిజం లేదని వెల్లడించిన సిద్ధరామయ్య

**బెంగుళూరు (ప్రశ్న న్యూస్)** కర్ణాటక ముఖ్యమంత్రి పదవి మార్పుపై కొంతకాలంగా కొనసాగుతున్న ఊహాగానాలకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఒక్క ప్రకటనతో తెరదించారు. రాష్ట్రానికి ఐదేళ్ల పాటు తానే ముఖ్యమంత్రిగా కొనసాగుతానని ఆయన స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు ముఖ్యమంత్రి పదవిని అప్పగించేందుకు తనను రాజీనామా చేయమని అధిష్ఠానం కోరినట్లు వస్తున్న వార్తలను ఆయన ఖండించారు. ఒక జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సిద్ధరామయ్య మాట్లాడుతూ, "ముఖ్యమంత్రి పదవిలో పూర్తి ఐదేళ్లు నేనే ఉంటాను. ఈ విషయాన్ని జులై 2వ తేదీన డీకే శివకుమార్ సమక్షంలోనే స్పష్టం చేశాను.
ఆయన కూడా ముఖ్యమంత్రి పదవికి పోటీదారుడే, అందులో తప్పేమీ లేదు. అయితే 'ప్రస్తుతం కుర్చీ ఖాళీగా లేదు' అని ఆయనే అన్నారు కదా" అని సిద్ధరామయ్య గుర్తు చేశారు. డీకే శివకుమార్‌కు మద్దతు ఇచ్చే కొంతమంది ఎమ్మెల్యేలు ఉన్నారని ఆయన అంగీకరించారు. రెండున్నరేళ్ల తర్వాత ముఖ్యమంత్రి మార్పు ఉంటుందనే అంశంపై అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, తమకు ఎటువంటి సూచనలు ఇవ్వలేదని ఆయన అన్నారు. అదే సమయంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కూడా ఆయన స్పందించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పటిష్టంగానే ఉందని, నిధుల కొరత లేదని సిద్ధరామయ్య స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను, ముఖ్యంగా ఈడీని కాంగ్రెస్ నాయకులను లక్ష్యంగా చేసుకుని దుర్వినియోగం చేస్తోందని ఆయన ఆరోపించారు.

# బీసీలకు రిజర్వేషన్ల తర్వాతే స్థానిక ఎన్నికలు

వెల్లడించారు. రెండు వారాలకు ఒకసారి క్యాబినెట్ భేటీ నిర్వహించాలని నిర్ణయించినట్టు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ నెల 25న మరోసారి క్యాబినెట్ సమావేశం జరగనుందని ఆయన చెప్పారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని నిర్ణయించినట్టు మంత్రి వివరించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన ఆర్డినెన్స్‌కు క్యాబినెట్ ఆమోదం తెలిపినట్టు మంత్రి తెలిపారు. అంతేకాదు, రాష్ట్రంలో కులగణన విజయవంతంగా పూర్తిచేశామని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నుంచి ఇప్పటి వరకూ 19 సార్లు క్యాబినెట్ సమావేశాలు నిర్వహించి 327 అంశాలపై చర్చించామని, 321 అంశాలకు ఆమోదం తెలిపామని పేర్కొన్నారు. క్యాబినెట్‌లో తీసుకున్న నిర్ణయాల్లో 96 శాతం అమలు చేశామని చెప్పారు.రాష్ట్రంలో రెండు విద్యా సంస్థలను యూనివర్సిటీలుగా మార్చేందుకు అనుమతించారు. అమిటీ, సెంటినరీ రిహాబిలిటేషన్ ఇన్‌స్టిట్యూట్‌లను విశ్వవిద్యాలయాలుగా మార్చే బిల్లుకు ఆమోదం తెలిపారు. యూనివర్సిటీల్లో 50 శాతం సీట్లు తెలంగాణ విద్యార్థులకే కేటాయించనున్నట్టు మంత్రి చెప్పారు.కాగా, ఇంతకు ముందు నిర్వహించిన సమావేశంలో ప్రతి 3 నెలలకు ఒకసారి మంత్రివర్గ భేటీ 'స్టేటస్ రిపోర్ట్ మీటింగ్'గా నిర్వహించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే.

ఇక, తాజా సమావేశంలో మేడిగడ్డ బ్యారేజీల రీపేర్లకు సంబంధించి ఎన్డీఎస్ఏ, విజిలెన్స్ నివేదికలపై కూడా చర్చించారు. అలాగే, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ సవరణ చట్టం, రేషన్ కార్డుల జారీ, గోశాలల నిర్మాణం, మహిళల కోసం మరిన్ని కార్యక్రమాలు సహా పలు అంశాలు కూడా భేటీలో చర్చకు వచ్చాయి.. స్థానిక సంస్థల ఎన్నికలను సెప్టెంబరు 30లోగా పూర్తిచేయాలని హైకోర్టు గత నెలలో ఆదేశించిన విషయం తెలిసిందే. అయితే, బీసీలకు 42 శాతం కోటా అంశం కీలకంగా మారడంతో ఆర్డినెన్స్‌ను ఆమోదించారు. క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ పథకాలను చేరువ చేయడం, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడంలో స్థానిక స్వపరిపాలన సంస్థలు అత్యంత కీలకంగా ఉంటాయి. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తోన్న పథకాలు ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లాలంటే స్థానిక ఎన్నికలు పూర్తిచేయాల్సిందేననే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# మాస్టారుగా మారిన ముఖ్యమంత్రి

విద్యార్థులతో కలిసి నారా లోకేష్ కూడా ముందు బెంచ్‌లో కూర్చొని పాఠాలు శ్రద్ధగా విన్నారు. అనంతరం విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులను తల్లిదండ్రులకు అందజేశారు. వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. వారి మార్కులు, చదువుపై ఆరా తీశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఇతర వ్యక్తులతో మాట్లాడుతూ పాఠశాల ఎలా ఉంది. పాఠాలు ఎలా చెబుతున్నారు. సౌకర్యాలు ఉన్నాయా లేదా, తల్లికి వందనం వచ్చిందా లేదా ఇలా చాలా విషయాలు వారితో చర్చించారు. వారితో ఫొటోలు కూడా దిగారు. విద్యార్థి దశ నుంచి ఓ గోల్ పెట్టుకొని చదవాలని విద్యార్థులకు చంద్రబాబు సూచించారు. పరిస్థితులు ఒకప్పుడులా లేవని ఇప్పుడు కచ్చితంగా భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని విద్యావ్యవస్థల్లో మార్పులు తీసుకొస్తున్నట్టు వెల్లడించారు.

ఇదే టైంలో విద్యార్థులను మరింతగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం మరో గుడ్ న్యూస్ చెప్పింది. జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో మంచి ర్యాంకు సాధించి సీట్లు కొట్టిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు ప్రకటించింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులాల విద్యార్థుల్లో నీట్ లాంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో సీటు పొందిన విద్యార్థులకు లక్ష రూపాయలు నగదు బహుమతి అంద జేయనుంది. ఎస్సీ సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు 11 రకాల వస్తువులతో కాస్మెటిక్ కిట్స్ ఇవ్వాలని నిర్మయించింది. సీట్లు సాధించలేక పోయిన విద్యార్థులకు ప్రత్యేక కోచింగ్ ఇవ్వబోతున్నారు.

# రేవంత్ రెడ్డికి ఎమ్మెల్సీ కవిత సవాల్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను పదే పదే అసెంబ్లీకి రావాలంటూ సీఎం రంకెలు వేస్తున్నారని, ముందు మహిళలకు ఇస్తానన్న హామీల గురించి మాట్లాడాలని ఎద్దేవా చేశారు. కేసీఆర్ అసెంబ్లీకి రావడం కాదు తామే మీ పోలీస్ కంట్రోల్ సెంటర్‌కు వస్తామంటూ సెటైరికల్‌గా మాట్లాడారు. డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడటం మానుకొని మహిళలకు ఎందుకు తులం బంగారం ఇస్తలేరో చెప్పాలంటూ ప్రశ్నించారు. తెలంగాణ జాగృతిలో కొత్తగూడెం సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీరన్న చేరిక సందర్భంగా కవిత మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారని మహిళలకు ఇస్తానన్న నెలకు రూ. 2,500ను ఎందుకు ఇవ్వడం లేదో చర్చ చేద్దామన్నారు.

తులం బంగారం ఎందుకు ఇస్తలేరో పింఛన్లు ఎందుకు పెంచడం లేదో చర్చిద్దామన్నారు. మీ మోసాలను ప్రజలు గమనిస్తూనే ఉంటారని గుర్తుంచుకోవాలని ఆమె చెప్పారు. తెలంగాణ జాగృతిని రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతపరుస్తామని, సీఐటీయూ కొత్తగూడెం జిల్లా కార్యదర్శి వీరన్న, ఆయన అనుచరుల చేరికపై కవిత హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కనీసం జై తెలంగాణ అనడం లేదని, రాష్ట్రంలో పరిపాలన ఎలా ఉందో అందరం చూస్తున్నామన్నారు. రాష్ట్రంలో సంపూర్ణ రైతు రుణమాఫీ కాలేదని చర్చకు రమ్మంటే సీఎం పారిపోయాడంటూ ఎద్దేవా చేశారు. సింగరేణిని రేవంత్ రెడ్డి అస్సలు పట్టించుకోవడం లేదని, కనీసం ఉద్యోగాలు కూడా రావడం లేదంటూ కవిత విమర్శించారు. సింగరేణి బొగ్గు గనులను ప్రైవేట్ పరం చేస్తామంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. రేవంత్ రెడ్డికి అవినీతి చక్రవర్తి, అసమర్థ ముఖ్యమంత్రి అనే బిరుదు ఇచ్చామన్నారు. కొత్తగూడెం అంటేనే పరిశ్రమల జిల్లా అని స్పాంజ్ ఐరన్ కర్మాగారాన్ని పునరుద్ధరణ చేయాలని ఆమె కోరారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ.. భద్రాచలం చుట్టుపక్కలున్న ఐదు గ్రామ పంచాయతీలు ఆందోళనలో ఉన్నాయన్నారు. భద్రాచలం రాముడి భూములు పురుషోత్తపట్నంలో ఉన్నాయని, ఐదు గ్రామ పంచాయతీలను తెలంగాణలో కలిపేందుకు తుమ్మల చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# మయన్మార్‌లో చిక్కుకున్న యువత

ఉద్యోగాల కోసం ప్రయత్నించి ఏజెంట్ చేతిలో మోసపోయిన తన ఇద్దరు కుమారులతో పాటు మరో ఆరుగురు యువకులు మయన్మార్ సరిహద్దుల్లో బందీలుగా ఉన్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వారి ప్రాణాలు ప్రమాదంలో ఉన్నాయని, ఎలాగైనా కాపాడాలని ఆమె కన్నీటితో వేడుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న పవన్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికారులతో మాట్లాడారు. మానవ అక్రమ రవాణా ముఠాల చెరలో చిక్కుకున్న 8 మంది తెలుగు యువకుల దుస్థితిని వారికి వివరించి, వారిని రక్షించాలని కోరారు. పవన్ చొరవపై కేంద్ర విదేశాంగ శాఖ సానుకూలంగా స్పందించింది. బాధితులను వీలైనంత త్వరగా గుర్తించి, సురక్షితంగా భారత్‌కు తీసుకువచ్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టమైన హామీ ఇచ్చింది.

# తెగదు - తెల్లారదు

### తమను దూషించిన వారిని వదిలేసి..

అందుకు మల్లు రవి తనకు కొంత సమయం ఇవ్వాలని కోరారని, కమిటీ సమావేశంలో జరిగిన విషయాలు మీడియాకు చెప్పవద్దని కూడా ఎమ్మెల్యేలకు మల్లు రవి సూచించారు. కాగా వరంగల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వెర్సస్ కొండా మురళిగా మారిపోయింది. ఈ వివాదం తెగదు తెల్లారేటట్లు లేదని ఎమ్మెల్యేలే కమిటీ ఎదుట అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. తమను దూషించిన వ్యక్తి నేరుగా కమిటీని కలసి, చివరకు వినతి పత్రంలోనూ తమను తప్పుపడుతూ ఇచ్చినప్పటికీ కమిటీ ఏం చేయకుండా మీన మేషాలు లెక్క పెడితే ఎలా? అని ప్రశ్నించినట్లు తెలిసింది. తాము కూడా బహిరంగ వేదికలపై విమర్శలు చేసుకుంటూ పోతే పార్టీ పరువు బజారున పడుతుందని కూడా ఒక రకంగా హెచ్చరించినట్లు తెలిసింది.

### - భోజనాలకు కూడా వెళ్లకుండా..

క్రమశిక్షణ కమిటీ సంఘం కమిటీ ఛైర్మన్ మల్లు రవి వరంగల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను అందరినీ భోజనాలకు పిలవగా, అందుకు వారు సున్నితంగా నిరాకరించి వెళ్లడం కూడా కమిటీపై అసంతృప్తిని వెళ్లగక్కినట్లయిందని అంటున్నారు. మరొక వైపు క్రమశిక్షణ కమిటీ కొండా మురళిపై చర్యలు తీసుకుంటుందా? లేదా? అన్నది ఆసక్తికరంగా మారింది. ఒకవైపు ఎమ్మెల్యేల ఒత్తిడి, మరొక వైపు జిల్లాలో బలమైన నాయకుడు మధ్య జరిగిన వివాదం కావడంతో సున్నితంగా దీన్ని పరిష్కరించడానికి క్రమశిక్షణ కమిటీ ప్రయత్నిస్తుందని తెలిసింది.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుని ఇద్దరినీ పిలిచి కూర్చోబెట్టి మాట్లాడితే తప్ప సమస్యకు పరిష్కారం లభించదన్న అభిప్రాయం నేతల్లో వ్యక్తమవుతుంది. తెలంగాణ కాంగ్రెస్ లో క్రమశిక్షణ కమిటీ అంటే పెద్దగా ఎవరికీ భయం ఉండదు. ఎందుకంటే ఆ పార్టీలో ప్రజాస్వామ్యం ఎక్కువ.ఎవరిపైనైనా చర్యలు తీసుకుంటారన్నది మాత్రం అత్యాశే అవుతుంది.

# ఇందిరమ్మ క్యాంటీన్లలో రూ.5కే టిఫిన్

కూడా అందించనుంది.హైదరాబాద్ నగర ప్రజలకు జీహెచ్ఎంసీ భారీ శుభవార్త తెలిపింది. నగరంలోని పేద, మధ్య తరగతి ప్రజలకు అతి తక్కువ ఖర్చుతో ఆకలి తీర్చాలన్న ఉద్దేశంతో ఆకలి తీర్చేందుకు జీహెచ్ఎంసీ మరో ముందడుగు వేసింది. నగర వ్యాప్తంగా 139 ప్రాంతాల్లో రూ.11.43 కోట్లతో కంటైనర్ల ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. ఈ క్యాంటీన్లలో లంచ్ తో పాటు త్వరలో రూ.5 కే అల్పాహారం కూడా అందించనుంది. ఇడ్లీ, ఉప్మా, పూరీ వంటి వివిధ రకాల టిఫిన్‌లు ఉదయం 7 నుండి 10 గంటల వరకు అందుబాటులో ఉంటాయి. ఈ పథకం ద్వారా ప్రజలకు నాణ్యమైన, శుచిగా ఉండే టిఫిన్‌ను తక్కువ ధరకే అందించాలని జీహెచ్ఎంసీ భావిస్తోంది.జులై 10న జరగనున్న స్టాండింగ్ కమిటీ సమావేశంలో హైదరాబాద్ నగర వ్యాప్తంగా ఇందిరమ్మ క్యాంటీన్లను ఏర్పాటుపై చర్చించనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రతి సంవత్సరం రూ.15.33 కోట్లు అవసరమని జీహెచ్ఎంసీ అంచనా వేస్తోంది. ప్రస్తుతం గ్రేటర్‌లోని 139 కేంద్రాల్లో మధ్యాహ్నం భోజనం రూ.5కే ఇస్తున్నారు. ఒక్కో భోజనానికి రూ.27.50 ఖర్చవుతోంది. అయితే రూ.22.50లను జీహెచ్ఎంసీ భరిస్తూ ప్రజల నుంచి రూ.5 తీసుకుంటోంది. ప్రస్తుతం టిఫిన్ సెంటర్లలో ఏ టిఫిన్ తినాలన్నారూ. 30 నుంచి రూ. 50 వరకు చెల్లించాలి. ఇక కాస్ట్లీ హోటల్స్ లో అయితే రేట్లు రూ. వందల్లో ఉంటాయి. ఈ ధరను నగరంలోని కార్మికులు, శ్రామికులు, పేద, మధ్యతరగతి ప్రజలు భరించలేక ఉన్నారు. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ కీలక నిర్ణయం తీసుకుంది. రూ. 5 కే మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు ఇక నుంచి రూ. 5 కే మిల్లెట్ టిఫిన్ అందించాలని నిర్ణయించింది. ఇలా ఐదు రూపాయలకు అందించే టిఫిన్ కు వాస్తవానికి రూ.19 ఖర్చు కానుండగా ఈ మొత్తంలో రూ.14 జీహెచ్ఎంసీ భరించనుంది. ప్రజల నుంచి రూ.5 వసూలు చేయనుంది.

# తెలంగాణ మ్యాప్ వివాదం

ఆయన ఉండవల్లిలోని మంత్రి నారా లోకేష్ నివాసంలో లోకేష్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా భారతదేశ చిత్రపటాన్ని మాధవ్ నారా లోకేష్‌కు అందజేశారు. భారతదేశ సాంస్కృతిక వైభవం పేరుతో ఉన్న చిత్రపటాన్ని ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్, నారా లోకేష్‌కు అందజేశారు. అయితే ఈ చిత్రపటంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను వేర్వేరుగా కాకుండా కలిపి ఆంధ్రప్రదేశ్‌గా చూపించడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ట్వీట్ చేశారు. ఏపీ బీజేపీ చీఫ్ చేసిన పనికి భారతీయ జనతా పార్టీ అధిష్టానం తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. "సాంస్కృతిక గుర్తింపు, చరిత్రలో సరైన స్థానం, భౌగోళిక గుర్తింపు కోసం తెలంగాణ ప్రజానీకం కొన్ని తరాలు పోరాటం చేసింది. కానీ ఈరోజు, మీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీజేపీ చీఫ్ మాధవ్ గారు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మ్యాప్‌ను బహుమతిగా ఇచ్చి, తెలంగాణ ఉనికిని విస్మరించారు. దీని ద్వారా మా పోరాటాన్ని తక్కువ చేశారు. ఇది ఎంతమాత్రమూ ఆమోదయోగ్యం కాదు. తెలంగాణ ప్రజలకు, తెలంగాణ రాష్ట్రానికి, తెలంగాణ పోరాటానికి, అమరవీరుల త్యాగాలు, చరిత్ర పట్ల స్పష్టమైన నిర్లక్ష్యంగా కనిపిస్తోంది. మా చరిత్రను తుడిచేస్తే, ఇక మేం ఏమిటి?" అంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కేటీఆర్ ట్వీట్ చేశారు. ఈ ఘటన బీజేపీ పార్టీ ప్రణాళికను తెలియజేస్తోందా లేదా రాజకీయ ఎజెండాను ప్రతిబింబిస్తుందో స్పష్టం చేయాలని ప్రధానమంత్రి మోదీని కేటీఆర్ కోరారు. తెలంగాణ అస్థిత్వాన్ని, తెలంగాణ భౌగోళిక గుర్తింపును గుర్తించకపోవటం బీజేపీ విధానమా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఒకవేళ ఇదే కనుక పొరబాటున జరిగి ఉంటే తెలంగాణ ప్రజలను అపహాస్యం చేసినందుకు బీజేపీ అధిష్ఠానం తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలంటూ కేటీఆర్ ట్వీట్ ద్వారా డిమాండ్ చేశారు. మరోవైపు సోషల్ మీడియాలోనూ ఈ ఫోటో వైరల్ అవుతోంది.

# ఇందిరమ్మ ఇళ్లలో ఎంపీలకు 40 శాతం కోటా ఇవ్వండి

తన లేఖలో పేర్కొన్నారు. అందువల్ల, ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో తమకు కూడా అవకాశం కల్పించాలని కోరారు. పార్టీలకు అతీతంగా రాష్ట్రంలోని మొత్తం 17 మంది ఎంపీలకు ఈ కోటాను వర్తింపజేయాలని ఆయన సూచించారు. దీనివల్ల లబ్ధిదారుల ఎంపికలో సహేతుకత, పారదర్శకత పెరుగుతాయని ఆయన స్పష్టం చేశారు. గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఎంపీగా పనిచేశారన్న విషయాన్ని రఘునందన్ రావు ఈ సందర్భంగా గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన ప్రధాన మంత్రి ఆవాస్ యోజన నిధులను ఇందిరమ్మ ఇళ్ల పథకంతో అనుసంధానించడాన్ని ఆయన స్వాగతించారు. తన అభ్యర్థనపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, వెంటనే నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు.

### బీహార్ ఓటర్ల జాబితా సవరణపై

# సుప్రీం డౌట్స్

ఎన్నికల సంఘం పెట్టిన షరతు ఈ వివాదాన్ని మరింత ముదిరేలా చేసింది. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టులో కీలక విచారణ జరిగింది. ఇందులో సుప్రీంకోర్టు కేంద్ర ఎన్నికల సంఘం బీహార్ లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణపై తీవ్ర అనుమానాలు వ్యక్తం చేసింది. ముఖ్యంగా ఎన్నికలకు రెండు నెలల ముందు చేపట్టిన ఈ ప్రక్రియ వల్ల ఓట్లు కోల్పోయిన వారు న్యాయపోరాటం చేసేందుకు వీల్లేకుండా పోతుందని జస్టిస్ సుధాంశు ధూలియా, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చీతో కూడిన సుప్రీంకోర్టు బెంచ్ ఆక్షేపించింది. ఎన్నికల సంఘం బీహార్ లో చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణపై తమకు అభ్యంతరాలు లేకపోయినా అది చేపట్టిన సమయంపై మాత్రం అనుమానాలు ఉన్నట్లు సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది. ఓసారి ఎన్నికల సంఘం ఓటర్ల తుది జాబితాలు ఖరారు చేసిన తర్వాత తిరిగి అందులో సుప్రీంకోర్టు కూడా జోక్యం చేసుకోలేదని, అటువంటప్పుడు ఓట్లు కోల్పోయిన వారి పరిస్థితి ఏంటని ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించింది. ఎన్నికల సంఘం అధికారాల్ని తాము ప్రశ్నించడం లేదని, కానీ అది చేపట్టిన ప్రక్రియపైనే తమకు అభ్యంతరాలు ఉన్నాయని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ముఖ్యంగా ఆధార్ ను ఓటరు గుర్తింపు కార్డు కోసం తీసుకోకపోవడాన్ని ఆక్షేపించింది. ఆధార్ తో పాటు రేషన్ కార్డు, ఓటరు కార్డుల్ని ఓటు వేసేందుకు అనుమతించాలని ఆదేశాలు ఇచ్చింది. ఈ కేసులో జూలై 21 కల్లా ఈసీ కౌంటర్ దాఖలు చేయాలని, 28న దీనిపై తిరిగి విచారణ జరుపుతామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

# సమాజంలో గురువు పాత్ర అత్యంత విశిష్టమైంది.మార్గమే గురువు...

### గురువే మార్గం.గురుపౌర్ణమి శుభాకాంక్షలు.

**వనపర్తి.** గురుపౌర్ణమి సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తన పాఠశాల గురువు నాగులపల్లి.సీతారామారావు ని హైదరాబాద్ లోని వారి స్వగృహంలో కలసి గురుపౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేసి పాదనమస్కారం చేసి గురుఅశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు జన్మనిస్తే గురువులు విద్యాబుద్ధులు,సంస్కారాన్ని,ఉన్నతవిలువలతో కూడిన జీవిత పాఠాలు నేర్పించి సమాజానికి మార్గదర్శకంగా నిలిపేది గురువులు అని కొనియాడారు

### రాష్ట్రంలో మరో రికార్డు సాధనకు

# రంగం సిద్ధం

**అమరావతి** గురువారం రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ 2.0.. ఒకేరోజు రెండు కోట్ల మందితో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మెగా సమావేశం జరిగాయి. సత్యసాయి జిల్లా కొత్తచెరువు జడ్పీ పాఠశాలలో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. మెగా పీటీఎం 2.0 కార్యక్రమానికి గిన్నిస్ బుక్ రికార్డు దక్కే అవకాశం.. పాఠశాలల్లో పండుగ వాతావరణంలో కార్యక్రమం నిర్వహించేలా ఏర్పాట్లు చేసారు. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో పీటీఎం 2.0 నిర్వహించారు. విద్యార్థులు తమ తల్లుల పేరుతో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు.

## ప్రభుత్వ పాఠశాలలో వస్తువుల పంపిణీ

మేడ్చల్, : మల్లాపూర్ డివిజన్‌లోని దుర్గానగర్ కాలనీలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్మైల్ విత్ షైన్ వెల్ఫేర్ సొసైటీ తరఫున అవసరమైన వస్తువులను గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్‌లో యువకుడి ఆత్మహత్యాయత్నం

బాన్సువాడ,: నిజామాబాద్ నగరంలోని ఆరో టౌన్ పోలీస్ స్టేషన్?లో ఓ యువకుడు ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. అర్సపల్లికి చెందిన ఓ యువకుడిని గంజాయి కేసులో పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. దీంతో మనస్తాపానికి గురైన ఆ యువకుడు పోలీస్ స్టేషన్? వాష్ రూంలో ఉన్న ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన పోలీసులు ఆస్పత్రిలో నిందితుడికి చికిత్స చేయించారు. అనంతరం యువకుడిని రిమాండ్‌కు తరలించారు.

## గురు పౌర్ణమి సందర్భంగా సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

బోధన్,: వేల్పూర్ మండల కేంద్రంలో గురువారం గురు పౌర్ణమి సందర్భంగా అమీనాపూర్ శివారులో గల సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఆలయ పూజారి, ఆలయ కమిటీ సభ్యులు తెలిపినారు. ఉదయం స్వామివారికి పంచామృత అభిషేకము, ప్రత్యేక అలంకరణ, యజ్ఞోమాలు, భక్తులకు ప్రసాద వితరణ అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సత్రం ఘనంగా నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావుకు షాక్!

నాంపల్లి, : రాజకీయ ప్రకంపనలు సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడు ప్రభాకర్ రావు విచారణకు సహరించడంలేదని.. సిట్ అధికారులు సుప్రీంకోర్టులో పిటిషన్ వేయనున్నట్టు సమాచారం. గతంలో ప్రభాకర్ రావును అరెస్ట్ చేయవద్దని సుప్రీంకోర్టు ఆదేశించి మినహాయింపులు ఇచ్చింది. ఈ నేపథ్యంలో వాటిని రద్దు చేయాలని కోరనున్నారు. ప్రభాకర్ రావును కస్టడీకి తీసుకోవాలని సిట్ అధికారులు భావిస్తున్నారు.

## హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కేసు

### ఐదుగురు అరెస్టు

**హైదరాబాద్** హెచ్సీఏ అధ్యక్ష ఎన్నికల్లో జగన్మోహన్రావు నకిలీ పత్రాలు సమర్పించినట్లు పోలీసులు నిర్ధారించారు. జగన్మోహన్రావు శ్రీ చక్ర క్రికెట్ క్లబ్ పేరుతో నకిలీ పత్రాలు సృష్టించారు. గౌలీపురా క్రికెట్ క్లబ్ ప్రెసిడెంట్ సి కృష్ణ యాదవ్ సంతకం ఫోర్జరీ అయింది. కృష్ణ యాదవ్ సంతకాన్ని శ్రీ చక్ర క్రికెట్ క్లబ్ ప్రెసిడెంట్ కవిత ఫోర్జరీ చేసినట్లు సమాచారం. ఫోర్జరీ పత్రాలను జగన్మోహన్రావుకు కవిత అందించింది.

నకిలీ పత్రాలుతోనే జగన్మోహన్రావు హెచ్సీఏ అధ్యక్షుడిగా ఎన్నికైయాడు. హెచ్సీఏ నిధులు దుర్వినియోగం చేశారని జగన్ మోహన్ రావు పై అభియోగం నమోదయింది. నిధులు దుర్వినియోగంపై టి సి ఏ అధ్యక్షుడు గురువారెడ్డి సిఐడి కి ఫిర్యాదు చేసారు. దాంతొఓ సిఐడి అధికారులు దర్యాప్తు చేపట్టి హెచ్ సి ఏ లో అక్రమాలు గుర్తించారు. జగన్మోహన్రావుకు కోశాధికారి శ్రీనివాసరావు సీఈవో సునీల్ సహకరించినట్లు ఆధారాలు లభించాయి. దాంతో జగన్మోహన్రావు ,శ్రీనివాసరావు, సునీత్, రాజేంద్ర యాదవ్, కవిత అరెస్ట్ అయ్యారు. .

## పరుపుల కంపేనీలో భారీ అగ్ని ప్రమాదం



**ఏలూరు** నగరంలో సుస్మిత ఎంటర్ప్రైజెస్ అనే పరుపులు తయారీతోపాటు పరుపులలో వినియోగించే ఫోమ్ తయారీ కంపెనీలో ఒక్కసారిగా మంటలు చెలరేగి ఆ ప్రాంతమంతా దట్టమైనపొగతో చీకట్లు అలముకున్నాయి అటు పోలీసులు ఇటు ఫైర్ సిబ్బంది మూడు గంటల పాటు శ్రమ నోర్చి ఎట్టకేలకు మంటలను అదుపుదల చేశారు. పూర్తిగా ఆస్తి నష్టం పై ఇంకా ఫైర్ సిబ్బంది పోలీసులు ఒక అంచనాకు రాలేదు. ఏలూరు డిఎస్పి శ్రావణ్ కుమార్ ఏలూరు వన్ టౌన్ సిఐ సత్యనారాయణ ఫైర్ సిబ్బంది సంయుక్తంగా ఈ మంటలను అదుపు చేసే ప్రక్రియలో పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందించారు ఎట్టకేలకు మంటలను అదుపుతాలు చేశారు. ఒక్కసారిగా పొగ అలముకోవడంతో స్థానిక ప్రజలు ఊపిరాడక ఇబ్బందిపడ్డారని స్థానికులు తెలియజేశారు. ఒకసారి గా ఫైర్ యాక్సిడెంట్ కావడం మంటలు చెల్లారేగడం అలాగే పొగ అలముకోవడం భారీ శబ్దాలతో పేలుళ్లు రావడంతో స్థానిక ప్రజలు ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యారు. చివరికి మంటలను అదుపుగా చేసి పరిస్థితులు చక్కబెట్టినందుకు అటు పోలీసులకు ఇటు ఫైర్ సిబ్బందికి స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.కెమికల్ ఎక్స్పోర్ కావడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయ లేదా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగాయ అన్న అంశంపై దర్యాప్తు కొనసాగుతుంది. ఫైర్ యాక్సిడెంట్ జరిగిన సమయంలో పని వారు ఇంకా ఎవరు పనికి రాకపోవడంతో పెను ప్రమాదమే తప్పిందని ప్రజల భావిస్తున్నారు. ఫోమ్ తయారీ వినియోగించే కెమికల్స్ కంపెనీకి బుధవారం వచ్చే చేరుకున్నాయి అయితే వాటిని బయట ఉంచకుండా ఏసీ లోనే ఉంచాలని యజమాని ఇచ్చిన ఆదేశాలను సెక్యూరిటీ గార్డ్ పాటిస్తూ ఏసీ ఆన్ చేసి వచ్చిన కొద్ది సేపటిలోనే పెద్ద మంటలు అలముకున్నాయని ఒకసారిగా పొగ అలముకుందని సెక్యూరిటీ గార్డ్ చెప్తున్నాడు

## మెగా పీటీఎంకు హాజరయిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్



**కొత్తచెరువు** శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు జడ్పీ పాఠశాలలో మెగా పీటీఎం 2.0 కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా తల్లికి వందనం పథకం ద్వారా లబ్ధిపొందిన తల్లులు, విద్యార్థులతో ముఖ్యమంత్రి, మంత్రి లోకేష్ ముఖాముఖి అయ్యారు. అనంతరం విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులు పరిశీలించి విద్యార్థులు, తల్లిదండ్రులకు సీఎం పలు సూచనలిచ్చారు. డిజిటల్ తరగతి గదిలో విద్యార్థులతో ముఖ్యమంత్రి ముచ్చటించారు. సహజ వనరులు, పునరుద్పాదక వనరుల గురించి విద్యార్థులకు ముఖ్యమంత్రి చంద్రబాబు పాఠం చెప్పారు.

## పెరిగిన ఏనుగుల సంచారం

### అన్నమయ్య కాలిబాటకు బ్రేక్

**తిరుపతి** ఏనుగుల బెడద తీవ్రం కావడంతో అన్నమయ్య కాలిబాట కు బ్రేక్ పడింది. శివరాత్రి సందర్భంగా గుండాల కొన వద్ద ముగ్గురు భక్తులను ఏనుగులు తొక్కి చంపిన ఘటనతో అధికారులు ముందు జాగ్రత చర్యలు తీసుకున్నారు. కడప జిల్లా కమలాపురం నుంచి 1000 మంది గోవింద భక్తులు పాదయాత్రగా 6 వ తేదీ న ప్రారంభించి గురువారం ఉదయం కుక్కలదొడ్డి వద్ద రాగా ఫారెస్ట్, పోలీసు సిబ్బంది అడ్డుకున్నారు. తిరుమల వెళ్ళాలంటే అలిపిరి మార్గము ద్వారా వెళ్ళాలని సూచించారు.

## దాడికి నాకు ఎలాంటి సంబధం లేదు మాజీ మంత్రి నారాయణ స్వామి

**చిత్తూరు** వైఎస్ జగన్ బంగారుపాళ్యం పర్యటనలో ఓ విలేకరిపై జరిగిన దాడి మీద మాజీ మంత్రి నారాయణ స్వామి వివరణ ఇచ్చారు. 'ఈ ఘటనకు నాకు ఎలాంటి సంబంధం లేదు. మంత్రి లోకేశ్ నిజనిజాలు తెలుసుకోకుండా స్పందించడం పద్ధతి కాదు. నా జీవితంలో ఎప్పుడూ ఎస్సీ, ఎస్టీలపై దాడులు చేయలేదు. హామీలు అమలు చేయాలని ప్రశ్నించడం తప్పా? అనవసర కేసుల్లో నన్ను, చిత్తూరు ఇన్ఛార్జ్ విజయనందరెడ్డిని ఇరికించడం సరికాదు' అంటూ ఆయన వీడియో విడుదల చేశారు.

## ఏలూరులో భారీ అగ్ని ప్రమాదం

**ఏలూరు** ఏలూరు వన్ టౌన్ పరిధి వంగాయగూడెం క్యాన్సర్ హాస్పిటల్ సమీపంలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది, పరుపులు తయారు చేసే గోడౌన్ లో అగ్ని ప్రమాదం సంభవించి మంటలు భారీగా ఎగసిపడ్డాయి. ఈ నేపథ్యంలో మంటలు భారీగా పొగ కమ్మేసింది. ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేసారు.

## పోలీస్ స్టేషన్‌కు చేరిన కోడి పంచాయితీ

**నల్లగొండ** నకిరేకల్ మండలం గొల్లగూడెంకు చెందిన గంగమ్మ అనే వృద్ధురాలికి పెంపుడు కోడి ఉంది. ఆ కోడి ప్రతిరోజు ఆరు బయటకు వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి వస్తుంది. గంగమ్మ ఇంటి పక్కనే ఉన్న రాకేష్ ఇంట్లోని గడ్డివాము వద్ద గింజలు తినేది. అయితే తన గడ్డివాములో గంగమ్మ కోడి గింజలు తింటుందనే ఆగ్రహంతో రాకేష్ కర్రతో కొట్టడంతో కోడి కాళ్లు విరిగిపోయాయి. తన కోడి కాళ్లు విరగొట్టిన రాకేష్ పై కేసు నమోదు చేయాలంటూ గంగమ్మ బోరున విలపిస్తూ రాత్రి నకిరేకల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇలాంటి గొడవలు సాధారణమే అంటూ కేసులు ఎందుకు..కోడికి ఎంత రేటో చెప్పు.. రాకేష్ తో డబ్బులు ఇప్పిస్తామని పోలీసులు చెప్పారు.నా కళ్ళముందే నా కోడిని కర్రతో కొట్టి కాళ్లు విరగొట్టాడని.. నాకు డబ్బులు వద్దు ఏమి వద్దు రాకేష్ కు శిక్ష పడాల్సిందేనంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. నా కోడికి జరిగినట్లు ఊళ్లో ఏ కోడికి జరగకూడదు అని గంగమ్మ పోలీసులతో వాగ్వాదానికి దిగింది. గంగమ్మకు సర్ది చెప్పేందుకు పోలీసులు ఎంత ప్రయత్నించినా వినలేదు. దీంతో చేసేది ఏమీ లేక నకిరేకల్ పోలీసులు.. గ్రామానికి వచ్చి పంచాయతీని పరిష్కరిస్తామని సర్ది చెప్పారు. ప్రస్తుతానికి ఇంటికి వెళ్లి కోడికి వైద్యం చేయించుకోమని చెప్పి గంగమ్మను ఇంటికి పంపించేశారు. ఈ కోడి పంచాయితీనీ ఎలా పరిష్కరించాలో అర్థం కాక పోలీసులు తలలు పట్టుకుంటున్నారు.

## రెండు కల్తీ పాల తమారీ కేంద్రాలపై ఎస్వోటీ దాడులు

### ఇద్దరు అరెస్టు



**భువనగిరి** భువనగిరి జోన్ పరిధిలో కల్తీ పాల కేంద్రాలపై ఎస్ఓటి పోలీసులు దాడులు నిర్వహించారు. మొన్నేవరిపంపు గ్రామంలో 80 లీటర్ల కల్తీ పాలు, 500ఎంఎల్ , హైడ్రోజన్ పెరాక్సైడ్ కెమికల్, 5 మిల్క్ పౌడర్స్ ,400 ఎంఎల్ యాసిటిక్ యాసిడ్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు సామల సత్తి రెడ్డిని అరెస్ట్ చేసారు. నిందితుడు ఎల్బీనగర్, ఉప్పల్లో స్వీట్ షాపులకు కల్తీ పాలు సప్లై చేస్తున్నాడు. సామల సత్తిరెడ్డిను భువనగిరి రూరల్ పోలీసులకు అప్పగించారు. మరో దాడి భువనగిరి కనుముక్కల గ్రామంలో కల్తీ పాల కేంద్రంపై ఎస్ఓటి పోలీసులు దాడి చేసారు. నిందితుడు కుంభం రఘు మలక్పేట్, దిల్సుఖ్నగర్ స్వీట్ షాపులకు కల్తీ పాలు విక్రయిస్తున్నాట్లు నిర్ధారించారు. 100 లీటర్ల కల్తీ పాలు, 200 ఎంఎల్ హైడ్రోజన్ పెరాక్సైడ్, 7 ప్యాకెట్స్ మిల్క్ పౌడర్, స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు కుంభం రఘును పోచంపల్లి పోలీసులకు అప్పగించారు.

## ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

**హైదరాబాద్** నగరవ్యాప్తంగా గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా కనుల పండుగ జరుగుతున్నాయి. గురు పౌర్ణమి ప్రశ్నించుకొని బాగ్ అంబర్పేట్ లోని శ్రీ శ్రీ షిరిడి సాయిబాబా సన్నిధిలో సాయిబాబా విగ్రహానికి భక్తులు ప్రత్యేక పూజ అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్శనం సాఫీగా సాగేలా నిర్వాహకులు అక్కడ అన్ని ఏర్పాట్లను చేసి ప్రత్యేక క్యూలైన్లను కూడా ఏర్పాటు చేశారు.పున్నమి నాడు శ్రీ షిరిడి దర్శించుకోవడం వల్ల అందరికీ తమ కోరికలు తీరుతాయని భక్తులు తెలిపారు.

## వ్యక్తి ఆత్మహత్య..

### కుటుంబ కలహాలే కారణమని అనుమానం

**ఏలూరు** గుర్తుతెలియని కారణాలతో వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు ఈ ఘటన ఏలూరు తూర్పు వీధిలో గురువారం ఉదయం చోటు చేసుకుంది. తూర్పు వీధికి చెందిన తేరా రఘు భార్యతో కలిసి గత కొద్దిరోజులుగా హైదరాబాదులో ఉంటూ కూలి పనులు చేస్తూ జీవిస్తున్నాడు. హఠాత్తుగా గురువారం ఉదయం ఏలూరుకువచ్చి తన సొంత ఇంటి వద్ద ఆత్మహత్యకు పాల్పడ్డాడు.



భార్యాభర్తల మధ్య గొడవలే ఆత్మహత్యకు కారణంగా పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు.

## నరసాపురంలో గురు పూజోత్సవం

**నరసాపురం** నరసాపురం పట్టణం లోని పార్క్ రోడ్లో నెలకొని శ్రీ సాయిబాబా ఆలయంలో ఈరోజు గురుపూజోత్సవం సందర్భంగా ఉదయం నుండి భక్తులతో బాబా ఆలయం కిక్కిరిసి పోయింది.ఆలయ పూజారి సాయి ఆధ్వర్యంలో బాబా వారికి భక్తులు విభూదితో పూజించారు.ఆలయ కమిటీ భక్తులకు ఏవిధమైన అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేసారు.

## డ్రోన్ కెమెరాలతో నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు

**కృష్ణా** జిల్లావ్యాప్తంగా ఏ ప్రదేశంలో అయితే నేరాలు జరిగేందుకు అవకాశం ఉంటుందో ఆ ప్రదేశాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపడుతూ ఎప్పటికప్పుడు వినూత్న ఆలోచనలతో ఆకతాయిల ఆట కట్టిస్తున్నారు కృష్ణా జిల్లా పోలీస్ యంత్రాంగం అందులో భాగంగా జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు ఆధ్వర్యంలో కనపడని డేగ కన్నుల డ్రోన్ కెమెరాలతో నిఘాను పటిష్టం చేసి అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెడుతున్నారు. అందులో భాగంగా ఈరోజు గుడ్లవల్లేరు పోలీస్ స్టేషన్ పరిధిలో గుడ్లవల్లేరు మెయిన్ సెంటర్ నందు బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్నారని గుర్తించి, మద్యం సేవిస్తున్న ఇద్దరిని అదుపులోనికి తీసుకొని, వారిపై కేసు నమోదు చేయడం జరిగింది.

## మనిషి జీవితాన్ని మార్చే శక్తి చదువుకు వుంది...

**కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలు..**

**విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో ఉన్నత శిఖరాలకు ప్రభుత్వ విద్య..**

**అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చెస్ క్రీడా పై శిక్షణ ఏర్పాటు చేస్తాం..**

**తుడా ఛైర్మెన్ డాలర్స్ దివాకర్ రెడ్డి..**

విద్యార్థులు పట్టుదల, కృషితో చదివితే జీవితంలో ఉన్న స్థాయికి చేరుకోగలరని తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి అన్నారు. గురువారం తిరుపతి కొర్లగుంట లోని శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ నందు మెగా పేరెంట్స్ మీటింగ్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన స్కూల్ ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం విద్యార్థులను వారి తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు. నేడు కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోకుండా ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక వసతులతో పాటు విద్యా ప్రమాణాలు మెండుగా ఉన్నాయని కొనియాడారు. యువ నాయకులు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ బాబు ప్రభుత్వ విద్యకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలలో డొక్కా సీతమ్మ గారి నాణ్యమైన మధ్యాహ్న భోజనం, ఉచితంగా పుస్తకాలు, ఉచితంగా యూనిఫామ్, షూ లు అందిస్తున్నారని, అదేవిధంగా ప్రతి విద్యార్థికి తల్లికి వందనం కింద 13000 జమ చేయడం జరిగిందని తెలియజేశారు. దేశంలో మరే ఇతర రాష్ట్రంలో కూడా ఈ విధంగా ప్రభుత్వ విద్యను అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వాలు లేవని చెప్పారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదివి ఈ స్థాయికి వచ్చానని గుర్తు చేశారు. చదువుతోపాటు ఆటపాటల్లో విద్యార్థులు రాణించాలని సూచించారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు జీవితంలో కష్టాలను ఎదుర్కొనే శక్తి అధికంగా ఉంటుందని పేర్కొన్నారు. గురువులను ఆదర్శంగా తీసుకుని ఉన్నత శిఖరాలకు వెళ్లాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల తెలివితేటలను పెంచేందుకు త్వరలో ప్రతి పాఠశాలలో చెస్ క్రీడ పై శిక్షణ ఏర్పాటు చేస్తామని ఈ విషయాన్ని తాను విద్యాశాఖ మంత్రి లోకేష్ బాబుకు వివరించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలలకు తుడా తోపాటు తన వ్యక్తిగతంగా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డిని పాఠశాల అధ్యాపకులు విద్యార్థుల తల్లిదండ్రులు ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ రవిచంద్రన్, ఇన్చార్జ్ హెడ్మాస్టర్ రవికుమార్, పాఠశాల ఛైర్మన్ వాణి, ఇన్చార్జి ఛైర్మన్ రహంతుల్లా, ఉపాధ్యాయులు, విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంతోనే చిత్తూరు అభివృద్ధి సాధ్యం

- చిత్తూరు కార్పోరేషన్ రూపురేఖలను మారుస్తాం
- అంతర్జాతీయ ప్రమాణాలతో జిల్లా కేంద్రాన్ని తీర్చిదిద్దుతాం
- చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్

**చిత్తూరు** కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. చిత్తూరు కార్పోరేషన్ రూపురేఖలను మార్చడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని వారు తెలిపారు. జిల్లా కేంద్రమైన చిత్తూరును అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దడమే తమ ముందున్న లక్ష్యమని ఉద్ఘాటించారు.చిత్తూరు నియోజకవర్గం అభివృద్ధే ప్రధాన ఎజెండాగా ముందుకు సాగుతున్న చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్..., చిత్తూరు నగరంలో ప్రధాన రహదారుల విస్తరణ పనులపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా గురువారం నగరంలోని ఏపీఎస్ఆర్టీసీ, భాస్కర హోటల్ సమీప రోడ్డైన చిత్తూరు రహదారి మార్గాల విస్తరణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ మీడియాతో మాట్లాడారు. ఏ ప్రాంతమైన రోడ్లు అభివృద్ధి చెందినప్పుడే అది ప్రగతి పథంలో దూసుకెళ్తుందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చెప్పిన విషయాలను ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో చిత్తూరు సర్వతో ముఖాభివృద్ధే.. తమ ప్రధమ కర్తవ్యంగా గుర్తెరిగి..,అహర్నిశలు శ్రమిస్తున్నట్టు ఎంపీ , ఎమ్మెల్యే చెప్పారు. ఈ భూమి పూజ కార్యక్రమంలో నగర మేయర్ కుమారి అముద, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ సీనియర్ నేతలు కాజూరు బాలాజీ, త్యాగరాజు, యువరాజుల నాయుడు,మాజీ కార్పొరేటర్ ఆనంద్ బాబు, కూటమి నాయకులు కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

## కమిషనర్ విచారణకు రాకపోతే డీజీపీని రప్పించాల్సి ఉంటుంది

### సైబరాబాద్ పోలీసులపై జాతీయ ఎస్టీ కమిషన్ సీరియస్

**హైదరాబాద్** హీరో విజయ్ దేవరకొండ కేసు విచారణకు కమిషనర్ రాకుండా ఏసీపీ రావడం పట్ల జాతీయ ఎస్టీ కమిషన్ అసహనం వ్యక్తం చేసారు. ఏప్రిల్ 26వ తేదీన రెట్రో సినిమా వేడుకలో గిరిజనుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ విజయ్ దేవరకొండపై రాయదుర్గం పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసారు.

ఇదే అంశంపై జాతీయ ఎస్టీ కమిషన్ కు కూడా ఫిర్యాదు చేయడంతో, కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో విచారణకు హాజరు కావాలని కమిషనర్ కు నోటీసులు ఇస్తే మీరెందుకు వచ్చారు, ఆ మాత్రం తెలియదా అంటూ మాదాపూర్ ఏసీపీ పట్ల హుస్సేన్ నాయక్ అసహనం వ్యక్తం చేసారు. మరో 15 రోజుల్లో హైదరాబాద్ కమిషనర్ విచారణకు హాజరు అవ్వకపోతే, డీజీపీని విచారణకు రప్పించాల్సి ఉంటుందని ఏసీపీని హెచ్చరించారు.

## తల్లిని రైతు వేదికలో వదిలేసిన నలుగురు కొడుకులు

**మహబూబాబాద్** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని భూపతి పేట గ్రామంలో కన్న తల్లిని కాదన్న కొడుకుల ఘటన గురువారం చోటుచేసుకుంది. తల్లిని సాదలేము అంటూ రైతు వేదికలో నలుగురు కొడుకులు వదిలి పెట్టారు. నలుగురు కొడుకులకు భారంగా మారిన కన్నతల్లి రైతువేదికలో తల దాచుకుంటుంది. తేలిక పాటి చద్దరితో చలికి తట్టుకోలేక వణుకుతున్న ఆమె పరిస్థితిని చూసి స్థానికులు కొడుకులు చేసిన పని పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు చొరవ చూపాలని కోరుతున్నారు.

## మత్స్యకారులకు అండగా
# కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం

**- అధునాతన సాంకేతికతను ఆకళింపు చేసుకోవాలి**
**- ప్రభుత్వ విప్ : ఆది శ్రీనివాస్**







**వేములవాడ, (ప్రశ్న న్యూస్)** మత్స్యకారుల అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పూర్తి మద్దతుగా నిలుస్తుందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం చంద్రంపేట గ్రామంలోని రైతు వేదికలో నేషనల్ అగ్రో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ మత్స్య రైతుల దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన మత్స్యకార సంఘాల సభ్యులను ప్రశంసాపత్రాలతో సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన చేపల స్టాల్స్‌ను సందర్శించారు. "రాజన్న సిరిసిల్ల జిల్లాలో మత్స్య సంపదను అభివృద్ధి చేసే దిశగా నేను ఎప్పుడూ మద్దతుగా ఉంటాను" అని ఆయన అన్నారు. ఇటీవల కరీంనగర్ వచ్చిన మంత్రి శ్రీహరితో చేపల పెంపకం, మత్స్యకారుల అభ్యున్నతిపై చర్చించామని వివరించారు.ప్రభుత్వం చెరువుల్లోకి సకాలంలో చేప పిల్లలను వదులుతుందని, బలహీన వర్గాల ఆర్థికాభివృద్ధికి మత్స్యశాఖ ద్వారా సహకారం అందిస్తుందన్నారు.

### కేజీ కల్చర్ విధానం ద్వారా చేపల పెంపకం

మిడ్ మానేరు డ్యాంలో కేజీ కల్చర్ విధానంలో చేపల పెంపకం చేపట్టేలా ముంపు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. ఈ విధానంలో మత్స్యకారులు పాల్గొంటే ప్రభుత్వం సబ్సిడీలు అందజేస్తుందని హామీ ఇచ్చారు.

### తెగిపోయిన చెరువుల మరమ్మతులు పూర్తిచేశాం

తాను ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత కేవలం 3 నెలల్లో కథలాపూర్ మండలంలోని చెరువులు మరమ్మతు చేయించినట్లు గుర్తు చేశారు. మల్కపేట్ రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేసి ఎల్లారెడ్డిపేట వరకూ సాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

### ప్రస్తుత ప్రభుత్వం పథకాల అమలులో ముందంజ

గత ప్రభుత్వ పథకాలను రద్దు చేయకుండా కొనసాగిస్తున్నామని, కొత్త పథకాలను కూడా అమలు చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కి గ్యాస్ సిలిండర్, రూ.10 లక్షల అరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇళ్లు,కొత్త రేషన్ కార్డులు వంటి హామీలను నెరవేర్చినట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ స్వరూప, ఫిషరీస్ చైర్మన్ చొప్పరి రామచంద్రం, డిఏఓ అఫ్జల్ బేగం, మల్లిఖార్జున్, పి.కిషోర్, నేషనల్ అగ్రో ఫౌండేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ సునీల్ కుమార్, అడ్వైజర్ విద్యాసాగర్,సిరిసిల్ల కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు చొప్పదండి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడిని
# ఆరాధించడం మన సంప్రదాయం

**- మెగా పేరెంట్ టీచర్ మీటింగ్లో ముఖ్యమంత్రి చంద్రబాబు**

**పుట్టపర్తి** పుట్టపర్తి నియోజకవర్గం, కొత్తచెరువు జెడ్పీ పాఠశాలలో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్లో ముఖ్యమంత్రి చంద్రబాబు తల్లితండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులను ఉద్దేశించి ప్రసంగించారు. పాఠశాల అనేది విద్యను అందించే దేవాలయం. ఈ ఆధునిక దేవాలయాలను రక్షించుకునే బాధ్యత మన అందరిదీ. ఈ స్థాయిలో తల్లితండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్న విద్యా శాఖ మంత్రి లోకేష్ ను అభినందిస్తున్నా. తల్లితండ్రుల తర్వాత ఉపాధ్యాయుడినే ఆరాధించటం మన సంప్రదాయం. గురుపౌర్ణమి రోజున రాష్ట్రవ్యాప్తంగా 61 వేల పాఠశాలల్లో 2.28 కోట్ల మందితో ఈ సమావేశం నిర్వహించుకోవడం సంతోషం. లోకేష్ పాఠశాలలో ఉన్నప్పుడు పేరెంట్స్ మీటింగ్ నేను ఎప్పుడూ వెళ్లలేకపోయా. నా సతీమణి భువనేశ్వరి ఏ సమావేశాన్నీ విడిచిపెట్టకుండా వెళ్లి లోకేష్ ను కేంబ్రిడ్జి వరకూ చదివించటంలో శ్రద్ధ పెట్టారు. డ్వాక్రా సంఘాలకు పొదుపు నేర్పించి కుటుంబ ఆదాయం పెరిగేలా చేశాం. మహిళల పొదుపు కోసం బలమైన వ్యవస్థకు రూపకల్పన చేసి అభివృద్ధికి తోడ్పాటు ఇచ్చామని అన్నారు.కుటుంబంలో ఉన్న ప్రతీ పిల్లవాడినీ చదివించాలనే లక్ష్యంతో తల్లికి వందనం పథకాన్ని అందరికీ వర్తింప చేశాం. ఎంతమంది ఉన్నా వారందరికీ ఈ పథకాన్ని అందించి ఆ కుటుంబాల్లో వెలుగులు తీసుకువచ్చాం. పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యాశాఖ బాధ్యతను లోకేష్ ఏరికోరి తీసుకున్నారు. స్టాన్ పర్డ్ లాంటి విద్యా సంస్థలో చదువుకున్న లోకేష్ రాష్ట్రంలోని విద్యార్థులందరి భవిష్యత్తు తీర్చిదిద్దుతారని ఈ బాధ్యత అప్పగించాం. మొదటి దఫా పేరెంట్ టీచర్ మీటింగ్ ను 44 వేల పైచిలుకు పాఠశాలల్లో నిర్వహించాం. ఈసారి ప్రైవేటు స్కూళ్లలోనూ వీటిని నిర్వహించాలని ఆదేశించామని అన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ప్రైవేటు స్కూల్లకు ధీటుగా తీర్చిదిద్దే బాధ్యత కూటమి ప్రభుత్వానిది. నెల్లూరులోని ఓ ప్రభుత్వ పాఠశాలలో సీట్లు ఖాళీలేవని నోవేకెన్సీ బోర్డు పెట్టారంటే నాణ్యత ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వ పాఠశాలలో పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు అత్యుత్తమ నైపుణ్యం కలిగిన వారు. మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ 2.0కు 2.28 కోట్ల మంది హాజరయ్యారు. గిన్నీస్ రికార్డు సాధించేలా ఈ కార్యక్రమాన్ని చేపట్టాం. తల్లిపేరిట ప్రతీ విద్యార్థి ఒక మొక్క నాటేలా చర్యలు తీసుకున్నాం. వారికి గ్రీన్ పాస్ పోర్టు కూడా ఇచ్చాం. తల్లితండ్రులు లీప్ యాప్ ను డౌన్ లోడ్ చేసుకోవాలి. విద్యార్థుల హాజరు, వారికి వచ్చిన మార్కులు , ప్రవర్తన అన్నీ యాప్ ద్వారా సమాచారం ఇస్తున్నాం. విద్యార్థులకు మంచి నాణ్యమైన యూనిఫాం, బూట్లు, బెల్టు, బ్యాగ్ ఇచ్చారు. మిమ్మల్ని చూస్తే నాకూ చదువుకోవాలని ఉంది. విద్యార్థులకు ఇచ్చిన కిట్లపై ఎలాంటి వ్యక్తుల ఫోటోలు పెట్టలేదు. రు.980 కోట్లు వీటి కోసం వ్యయం చేశాం. నా చిన్నతనంలో నా తల్లి పొట్లాం కట్టిస్తే ఆరు కిలోమీటర్లు నడిచి పాఠశాలకు వెళ్లాను. ఇప్పుడు మీకు ఆ ఇబ్బంది లేకుండా నాణ్యమైన సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం పెడుతున్నాం. విద్యాశాఖను మెరుగు పర్చడానికి తల్లితండ్రులు, ఉపాధ్యాయుల అందరి సూచనలూ తీసుకుంటాం. గత ప్రభుత్వ హయాంలో విశాఖ ఏజెన్సీలో గంజాయి పెద్ద ఎత్తున పండించారు. డ్రగ్స్ , గంజాయి విక్రయించినా పండించినా అదే వారికి చివరి రోజు. డ్రగ్స్ వద్దు బ్రో అనే కార్యక్రమం ద్వారా దీన్ని నియంత్రించే డ్రగ్స్ , గంజాయి విక్రయించే వారి ఆస్తిని కూడా స్వాధీనం చేసుకుంటాం.డ్రగ్స్ , గంజాయి విక్రయించేవారి కుటుంబాలకు ఇచ్చే సంక్షేమ కార్యక్రమాలు కూడా నిలుపుదల చేస్తాం. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంచేలా కార్యక్రమాలు చేస్తున్నాం. అబ్దుల్ కలాం లాంటి వ్యక్తులు మనకు స్ఫూర్తి కావాలి. గతంలో 12 సార్లు డీఎస్సీలు చేసి 1.66 లక్షల మందిని ఉపాధ్యాయులను నియమించాంమని అన్నారు.గత ప్రభుత్వం ఒక్క డీఎస్సీ కూడా చేపట్టలేదు.

అద్యాఫకులు లేకుండా సంస్కరణలు ఏమిటి. గత ప్రభుత్వ హయాంలో టోఫెల్ అన్నారు. ఐబీ సిలబస్ అన్నారు. ఒక్కటి కూడా అమలు కాలేదు. కూటమి అధికారంలోకి వచ్చాక మెగాడీఎస్సీ నిర్వహించి 16,347 మంది ఉపాధ్యాయులను నియమిస్తున్నాం. ఆగస్టు నాటికల్లా వారంతా పాఠశాలలకు వస్తారు. కూటమి ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయుల బదిలీలను పారదర్శకంగా నిర్వహించాం. 40 లక్షల మంది పైచిలుకు తల్లులకు తల్లికి వందనం పథకం అందించాం. గత ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల అప్పులు చేసింది. దాని అసలు తీర్చాలి, వడ్డీలు కట్టాలని అన్నారు.ఇన్ని ఇబ్బందులు ఉన్నా మీకిచ్చిన మాట నిలబెట్టుకోవడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించేలా షైనింగ్ స్టార్స్ అని అవార్డులు ఇస్తున్నాం. షైనింగ్ స్టార్స్ ఉన్న విద్యార్థుల అందరికీ నచ్చిన కాలేజీల్లో చదువుకునేలా ప్రణాళిక చేస్తామని అన్నారు.

# ఈ 5 ఆహారాలను స్టీల్ బాక్సుల్లో ఉంచొద్దు

మన తెలుగు ఇళ్లలో వంటగది అనగానే తళతళా మెరిసే స్టీలు డబ్బాలు, పాత్రలే గుర్తొస్తాయి. పప్పులు, ఉప్పులు దాచుకోవడానికే కాకుండా, మిగిలిపోయిన కూరలను, పెరుగును నిల్వ చేయడానికి కూడా చాలామంది వీటినే వాడుతుంటారు. స్టీలు పాత్రలు శుభ్రం చేయడం తేలిక, మన్నిక ఎక్కువ కావడంతో వీటి వాడకం సర్వసాధారణం. అయితే, కొన్ని రకాల ఆహార పదార్థాలను స్టీలు గిన్నెల్లో నిల్వ చేయడం వల్ల రుచి మారడమే కాకుండా, ఆరోగ్యానికి కూడా హాని కలుగుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొన్ని పదార్థాలు స్టీలుతో రసాయనిక చర్య జరిపి విషతుల్యంగా మారే ప్రమాదం కూడా ఉంది. ఇంతకీ స్టీలు పాత్రల్లో నిల్వ చేయకూడని ఆ ఆహార పదార్థాలు ఏంటో వివరంగా చూద్దాం.

### - పచ్చళ్లు, ఊరగాయలు

తెలుగు భోజనంలో ఊరగాయలది ప్రత్యేక స్థానం. నిమ్మకాయ, ఆవకాయ, మాగాయ వంటి పచ్చళ్లలో ఉప్పు, కారం, నూనెతో పాటు పులుపు కోసం నిమ్మరసం, వెనిగర్, చింతపండు వంటివి ఎక్కువగా వాడతాం. ఈ ఆమ్ల గుణం ఉన్న పదార్థాలు స్టీలుతో చర్య జరుపుతాయి. ముఖ్యంగా నాణ్యత లేని స్టీలు పాత్రల్లో పచ్చళ్లను నిల్వ ఉంచినప్పుడు, వాటి రుచిలో తేడా వస్తుంది. లోహపు వాసన రావడంతో పాటు పచ్చడి త్వరగా పాడైపోయే ప్రమాదం ఉంది. అందుకే ఊరగాయలను ఎప్పుడూ గాజు సీసాల్లో నిల్వ చేయడమే శ్రేయస్కరం.

### - పెరుగు

చాలామంది రాత్రి మిగిలిన పెరుగును స్టీలు గిన్నెలోనే ఉంచి ఫ్రిజ్‌లో పెడుతుంటారు. ఇది ఏమాత్రం మంచి పద్ధతి కాదు. పెరుగులో సహజంగానే లాక్టిక్ యాసిడ్ ఉంటుంది. దీనిని ఎక్కువసేపు స్టీలు పాత్రలో ఉంచినప్పుడు, ఆ ఆమ్లం లోహంతో చర్య జరిపి పెరుగు రుచిని పాడుచేస్తుంది. కొన్నిసార్లు పెరుగులోంచి ఒకరకమైన వింత వాసన రావడం కూడా గమనించవచ్చు. పెరుగును నిల్వ చేయడానికి మట్టిపాత్రలు, పింగాణీ లేదా గాజు గిన్నెలు వాడటం ఉత్తమం.

### - నిమ్మ, చింతపండుతో చేసిన వంటకాలు

పులిహోర, లెమన్ రైస్, నిమ్మరసం చారు, చింతపండు పులుసు, టమాటా పప్పు వంటి పుల్లటి వంటకాలను స్టీలు డబ్బాల్లో పెట్టడం అస్సలు సురక్షితం కాదు. వీటిల్లోని సిట్రిక్ యాసిడ్ స్టీలుతో కలిసిపోయి వంటకం అసలు రుచిని దెబ్బతీస్తుంది. పులుపుదనం తగ్గిపోవడమే కాకుండా, పోషక విలువలు కూడా నశిస్తాయి. ఇలాంటి వంటకాలను నిల్వ చేయాల్సి వస్తే గాజు లేదా ఫుడ్-గ్రేడ్ ప్లాస్టిక్ బాక్సులను ఎంచుకోవడం మేలు.

### -టమాటా ఆధారిత కూరలు

టమాటాను ఎక్కువగా వాడి చేసే గ్రేవీ కూరలు, పన్నీర్ బటర్ మసాలా, రాజ్మా వంటి వాటిని కూడా స్టీలు పాత్రల్లో ఎక్కువసేపు ఉంచకూడదు. టమాటాల్లోని ఆమ్లాలు స్టీలుతో చర్య జరిపి కూర రుచిని పాడుచేస్తాయి. ఈ చర్య వల్ల ఆహారం యొక్క పోషక ప్రొఫైల్ కూడా దెబ్బతింటుంది. మిగిలిపోయిన ఇలాంటి కూరలను పింగాణీ లేదా గాజు గిన్నెల్లోకి మార్చి ఫ్రిజ్‌లో పెట్టుకోవడం ఆరోగ్యానికి మంచిది.

### - కోసిన పండ్లు, ఫ్రూట్ సలాడ్

ఆరోగ్యం కోసం చాలామంది పండ్లను కోసి, ఫ్రూట్ సలాడ్ రూపంలో తింటారు. అయితే వీటిని స్టీలు గిన్నెల్లో లేదా డబ్బాల్లో నిల్వ చేస్తే అవి త్వరగా పాడవుతాయి. పండ్ల నుంచి వచ్చే రసాలు స్టీలు ఉపరితలంతో చర్య జరిపి వాటి తాజాదనాన్ని కోల్పోయేలా చేస్తాయి. ముఖ్యంగా అరటిపండు, నారింజ వంటి మెత్తటి పండ్లు త్వరగా నల్లబడి, వింత రుచిని సంతరించుకుంటాయి. వీటికి బదులుగా గాలి చొరబడని గాజు కంటైనర్లను వాడితే పండ్లు తాజాగా, జ్యూసీగా ఉంటాయి.



(NOTE: ఇంటర్నెట్‌లో సేకరించిన సమాచారం ఆధారంగా ఈ వివరాలు మీకు అందించటం జరిగింది. ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. తదుపరి జరిగే ఎలాంటి పరిణామాలకు ప్రజాప్రశ్న పత్రిక బాధ్యత వహించదు)

# సమాజంలో గురువు పాత్ర అత్యంత విశిష్టమైంది.మార్గమే గురువు...

**గురువే మార్గం.గురుపౌర్ణమి శుభాకాంక్షలు.**

**వనపర్తి.** గురుపౌర్ణమి సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తన పాఠశాల గురువు నాగులపల్లి.సీతారామారావు ని హైదరాబాద్ లోని వారి స్వగృహంలో కలసి గురుపౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేసి పాదనమస్కారం చేసి గురుఅశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు జన్మనిస్తే గురువులు విద్యాబుద్ధులు,సంస్కారాన్ని,ఉన్నతవిలువలతో కూడిన జీవిత పాఠాలు నేర్పించి సమాజానికి మార్గదర్శకంగా నిలిపేది గురువులు అని కొనియాడారు

## రాష్ట్రంలో మరో రికార్డు సాధనకు
# రంగం సిద్ధం

**అమరావతి** గురువారం రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ 2.0.. ఒకేరోజు రెండు కోట్ల మందితో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మెగా సమావేశం జరిగాయి. సత్యసాయి జిల్లా కొత్తచెరువు జడ్పీ పాఠశాలలో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. మెగా పీటీఎం 2.0 కార్యక్రమానికి గిన్నిస్ బుక్ రికార్డు దక్కే అవకాశం.. పాఠశాలల్లో పండుగ వాతావరణంలో కార్యక్రమం నిర్వహించేలా ఏర్పాట్లు చేసారు. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో పీటీఎం 2.0 నిర్వహించారు. విద్యార్దులు తమ తల్లుల పేరుతో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు.

# తోతాపురి రైతులవి తరగని కష్టాలు

**- కనీస ధర అందించడంలో కూటమి ప్రభుత్వానిది వైఫల్యం**
**- మాటలు కాదు రైతులకు శాశ్వత పరిష్కారం చూపండి**
**- నువ్వు కొట్టినట్లు చెయ్యి - నేను ఏడ్చినట్లు చేస్తా..**
**- ఇదే కూటమి వైకాపా మధ్య యవ్వారం**

**విజయవాడ** తోతాపురి రైతులవి తరగని కష్టాలు. ధరల పతనంతో రైతుకు తోతాపురి చేదు అయింది. - ఆరుగాలం కష్టించి పండించిన పంటకు ధర లేక రైతు విలవిలలాడుతుంటే, - కనీసం పట్టించుకునే పాపాన పోలేదని ఏపీసీసీ ఛీఫ్ షర్మిలా రెడ్డి అన్నారు. మద్దతు ధర అందించి రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ఘోర వైఫల్యం చెందింది. 16 రూపాయలు ధర కడితే తప్పా కోలుకోలేమని రైతులు చెప్తుంటే, 4 రూపాయల కన్నా ఎక్కువ కొనడం లేదని మొత్తుకుంటుంటే, 12 రూపాయలు అందించి న్యాయం చేశామని అబద్ధాలు చెప్పడం సరికాదని అన్నారు.. కూటమి ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం. తక్షణం తోతాపురి రైతుల కష్టాలపై ఉన్నత స్థాయి కమిటీ వేయండి. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు చేపట్టండి. నువ్వు కొట్టినట్లు చెయ్యి, నేను ఏడ్చినట్లు చేస్తా.. ఇదే కూటమి ? వైకాపా మధ్య నడుస్తున్న యవ్వారం. పైకి 500 మందితో అనుమతి ఇస్తారు..10 వేల మందితో వచ్చినా సహకరిస్తారు. పరామర్శల పేరుతో దగ్గరుండి బలప్రదర్శనలు చేయిస్తారు. కళ్ల ముందే జన సమీకరణ జరుగుతున్నా ప్రేక్షక పాత్ర పోషిస్తారని అన్నారు. కూటమి వారి ప్రొడక్షన్ లో, పోలీసు శాఖ సెట్టింగ్ లో, బంగారుపాళ్యం వైకాపా మామిడికాయ సినిమాను రక్తి కట్టించారు. - కూటమి సారథ్యంలో రైతుల పేరుతో జఅఖ అధ్యక్షులు జగన్ గారు నానా యాగీ చేశారు. ఎందుకంటే జగన్ గారు మోడీ గారికి దత్తపుత్రుడు కాబట్టి. - మోడీ గారితో జగన్ గారిది అక్రమ పొత్తు కాబట్టి. మోడీ గారి మద్దతుతో జగన్ గారు ఏది చేసినా రాష్ట్రంలో చెల్లుబాటు అవుతుంది కాబట్టి. తలకాయల మీద కార్లు పోనిచ్చినా, మామిడి కాయలు తొక్కుంటూ వెళ్ళినా, రప్పా రప్పా నరుకుతామని బహిరంగంగా హెచ్చరించినా చీమంత చర్య కూడా ఉండదు. ఇది డబ్బుతో కూడిన బలప్రదర్శన తప్ప జగన్ గారిది రైతుల కోసం చేసే పోరాటం కానే కాదని అన్నారు.

## శ్రీసిటీ స్థాయిలో
# కాకినాడకు పరిశ్రమలు

**కాకినాడ** కాకినాడ పరిసర ప్రాంతంలో మరెన్నో పరిశ్రమలు వస్తున్నాయని శ్రీ సిటీ తరహాలో మరింత అభివృద్ధి చేస్తామని ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు ఖఎై మాధవ్ అన్నారు.... గురుపౌర్ణమి సందర్భంగా కాకినాడ నగరంలో ఉన్న పలువురిని పెద్దలను కలిశారు.ఈసందర్భంగా బీజేపీ సీనియర్ నేత పైడా బావన ప్రసాద్ స్వగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాధవ్ మాట్లాడుతూ.. గురు పౌర్ణమి సందర్భంగా పెద్దలను గౌరవించుకునేలా రాష్ట్ర వ్యాప్తంగా కేంద్రం పిలుపుపై కార్యక్రమాలను చేపట్టామన్నారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి ఎన్నో నిధులను మంజూరు చేసి అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు ఎనలేని సహాయం అందిస్తోందని తెలిపారు.

రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టుకు 13 వేల కోట్లు, అమరావతికి 15 వేల కోట్లు విశాఖ ఉక్కు కర్మారానికి 11440 కోట్ల ప్యాకేజీ అందించామని అలాగే విశాఖ బి కాకినాడ కారిడార్, విశాఖబి చెన్నై కారిడార్, సాగరమాల వంటి ప్రాజెక్టులను ఆంధ్రప్రదేశ్లో చేపడుతున్నామని ఈసందర్భంగా తెలియజేశారు...

## కొత్తచెరువు జడ్పీ పాఠశాలలో
# మంత్రి నారా లోకేష్ ముఖాముఖి

**- తల్లికి వందనం పథకం కింద నలుగురు విద్యార్థులకు అందిన సాయం**
**- విద్యార్థులు, వారి తల్లితో మంత్రి లోకేష్ ముఖాముఖి**
**- విద్యార్థుల ఉన్నత చదువుల బాధ్యత తీసుకుంటానని హామీ**

**కొత్తచెరువు :** విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం మెగా పీటీఎం 2.0 కార్యక్రమంలో పాల్గొనేందుకు శ్రీ సత్యసాయి జిల్లా కొత్తచెరువు జడ్పీ పాఠశాల ప్రాంగణానికి చేరుకున్న విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ముందుగా జూనియర్ కళాశాల ప్రాంగణంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తల్లికి వందనం పథకం కింద సాయం పొందిన పి.మాధవి, ఆమె నలుగురు పిల్లలతో ముఖాముఖి నిర్వహించారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కొత్త చెరువు బీసీ కాలనీకి చెందిన పి.మాధవికి ఎనిమిదో తరగతి చదివే బాలు, ఏడో తరగతి చదివే నరసమ్మ, ఐదో తరగతి చదివే బేబీ, మూడో తరగతి చదివే సన అనే నలుగురు పిల్లలు ఉన్నారు. మాధవి నలుగురు పిల్లలకు తల్లికి వందనం పథకం కింద రూ.52వేల సాయం అందింది. దీంతో పీటీఎం కార్యక్రమంలో పాల్గొనేందుకు పాఠశాలకు చేరుకున్న మంత్రి లోకేష్ ముందగా తల్లి మాధవి, నలుగురు విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. పాఠశాలలో వసతులు ఎలా ఉన్నాయని ఆరా తీశారు. యూనిఫాం, మధ్యాహ్న భోజనం నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తల్లి మాధవి మాట్లాడుతూ.. తమకు తల్లికి వందనం పథకం కింద రూ.52వేల సాయం అందిందని, ఆ నగదును పిల్లల పేరుతో బ్యాంకులో డిపాజిట్ చేశామని వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. పిల్లల ఉన్నత చదువుల బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. పిల్లలను బాగా చదివించాలని చెప్పారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం బాగుందని ఈ సందర్భంగా విద్యార్థులు చెప్పారు. మధాహ్న భోజనంలో సన్నబియ్యం అందిస్తున్నామని, పుస్తకాల బ్యాగ్ బరువు తగ్గించేందుకు సెమిస్టర్ విధానం తీసుకువచ్చామని, వర్క్ బుక్ లు అందజేశామని ఈ సందర్భంగా మంత్రి వివరించారు. బాగా చదువుకోవాలని, తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవించాలని పిల్లలకు సూచించారు. తల్లికి వందనం కింద నలుగురు పిల్లలకు సాయం అందించడంతో పాటు.. మంత్రి నారా లోకేష్ తమ పట్ల చూపించిన ఆపాయ్యత పట్ల మాధవి, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

## మానవ అక్రమ రవాణా ముఠాల చెరలో
# మగ్గుతున్న మా కుమారుల్ని రక్షించండి

**- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు మహిళ వినతి**
**- సమస్యను విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ దృష్టికి తీసుకువెళ్లిన పవన్ కళ్యాణ్**

**విజయవాడ** ఉద్యోగాల కోసం ప్రయత్నించి ఏజెంట్ చేతిలో మోసపోయి విదేశాల్లో మానవ అక్రమ రవాణా ముఠాల చెరలో మగ్గుతున్న తమ కుమారులను రక్షించాలంటూ గండబోయిన సూర్యకుమారి అనే మహిళ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు వినతిపత్రం సమర్పించారు. విజయనగరానికి చెందిన ఆమె మయన్మార్ సరిహద్దుల్లో బందీలుగా ఉన్న తమ వారి ప్రాణాలు ప్రమాదంలో ఉన్నాయని, వారిని విడిపించేందుకు సాయం చేయాలని వేడుకున్నారు. బుధవారం పవన్ కళ్యాణ్ ని కలసి.. తమ ఇద్దరు కుమారులతోపాటు 8 మంది మానవ అక్రమ రవాణా ముఠాల చెరలో ఉన్నట్టు వివరించారు. దీనిపై స్పందించిన పవన్ కళ్యాణ్ విషయాన్ని కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకువెళ్లారు. మానవ అక్రమ రవాణా ముఠాల చెరలో చిక్కుకున్న వారిని రక్షించాలని కోరారు. ఈ వ్యవహారంపై విదేశీ వ్యవహారాల శాఖ సానుకూలంగా స్పందించింది. విదేశాల్లో మగ్గుతున్న వారిని వెనక్కి తీసుకురావడానికి తగిన హామీ ఇచ్చారు.

# దేవుడి ప్రతి రూపమే గురువునామ జపం ద్వారానే దేవుడి అనుగ్రహం

**- శ్రీ శ్రీ శ్రీ సద్గురు స్వామిసమర్థ మహారాజ్ అభిభాషణ**

**జగిత్యాల :** దేవుడి ప్రతిరూపమే గురువని,గురువుకు సేవ చేస్తే చాలని ఆయన అన్ని చూసుకుంటాడని శ్రీ శ్రీ శ్రీ సద్గురు స్వామిసమర్థ మహారాజ్ అన్నారు.గురుపౌర్ణమినీ పురస్కరించుకొని సిద్ధిపేట జిల్లాలోని సద్గురు స్వామి సమర్థ మహారాజ్ ఆశ్రమానికి జగిత్యాలకు చెందిన నీలం దశరథ రెడ్డి గురుస్వామి ఆధ్వర్యంలో గురువారం మహిళలు, భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు.ఈ సందర్భంగా సద్గురు స్వామిసమర్థ మహారాజ్ భక్తులనుద్దేశించి అభిభాషణ చేస్తూ..గురువు వద్ద సద్గుణంతో ఉంటూ గురువు మాటను పాటిస్తూ ఉంటే ఆయన జ్యానాన్ని ప్రసాదిస్తాడని,అందుకుగురువు చూపిన మార్గాన్ని అనుసరించాలన్నారు.గురువు అంటే ఒక పర్వతం, ఒక గుడి లాంటివారని,గురువు దగ్గర అహం ప్రదర్శించకుండా ఉంటేశిష్యులను గురువు ఎప్పుడు పర్యవేక్షిస్తుంటాడని స్పష్టం చేశారు.గురువు,శిష్యులు బంధం జన్మ జన్మల అనుబంధమనిచెబుతూగురువుపై నమ్మకంతో ఉంటే మనకు ఏది కావాలో, సమయం వచ్చినప్పుడు గురువు అడగడకుండానే ఇస్తారని సద్గురు స్వామిసమర్థ మహారాజ్ పేర్కొన్నారు.తల్లి,తండ్రి, గురువు, ధైవాన్ని పూజించండని, నామ జపం ద్వారానే దేవుడీ అనుగ్రహం దొరుకుతుందన్నారు.గురువుకు సంబంధించిన పారాయణం చేస్తే ఆయనే మనకు అన్ని ప్రసాద్దిస్తాడని చెప్పారు.ప్రాపనీచిక స్థితి నుండి ఆధ్యాత్మిక స్థితికి మార్చడమే మనం నమ్మిన దేవుడు ఇచ్చే గొప్ప వరమని పేర్కొంటూ ప్రతి ఒక్కరూ సమాజహితం కోసం పనిచేయాలని సూచించారు.రాష్ట్రనీ నలుమూలల నుండి పెద్ద ఎత్తున ఆశ్రమానికి మహిళలు భక్తులు తరలిరాగా క్యూ పద్ధతిలో స్వామివారిని దర్శించుకుని తమ సమస్యలు చెప్పుకుని ఉపశమనం పొందారు.స్వామిని దర్శించుకున్న వారిలో జగిత్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి, శోభా, నాగరాజు, వంగల కిషన్, ధనుంజయ్, చక్రపాణి,బట్టు రాజు, సభిత, రాణి, వీణ, లహరీ, లావణ్య, దివ్య,తదితరులున్నారు.

## గురుపౌర్ణమి సందర్భంగా

# గురువులకు బీజేపీ ఘన సన్మానం

**- సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో వేడుకల సందడి**

**- భాజపా పట్టణాధ్యక్షులు : రాపెల్లి శ్రీధర్**




**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** వేములవాడ పట్టణ భాజపా శ్రేణులు గురుపౌర్ణమి వేడుకలను పురస్కరించుకొని గురువారం స్థానిక సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో గురువులను ఘనంగా సన్మానించారు. భారతీయ సంస్కృతిలో గురువు స్థానం గొప్పదేనని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో భాజపా పట్టణాధ్యక్షులు రాపెల్లి శ్రీధర్,బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్, జిల్లా అధ్యక్షులు సంటి మహేష్,భాజపా రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గోపు బాలరాజు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పట్టణ బీజేపీ అధ్యక్షులు రాపెల్లి శ్రీధర్ మాట్లాడుతూ"గురువు అనేది మనకు జ్ఞానం,ఆచరణ,మార్గదర్శనం చూపించే పవిత్ర వ్యక్తి. గురుపౌర్ణమి రోజున వారిని గౌరవించుకోవడం మన బాధ్యత" అని పేర్కొన్నారు.గురువులకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలతో సన్మానించారు.పాఠశాల ఉపాధ్యాయులు ఈ కార్యక్రమం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# పర్యావరణం పరిరక్షణ మనందరి బాధ్యత

**- జమాతే ఇస్లామీ అధ్యక్షుడు మహమ్మద్ సర్దార్ ఖాన్.....**

**- కాకతీయ పాఠశాలలోఈ కార్యక్రమం....**



**మంథని( ప్రశ్న న్యూస్)** పర్యావరణం పరిరక్షణ మనందరి బాధ్యత అని జమాతే ఇస్లామీ హింద్ మంథని శాఖ అధ్యక్షుడు మహమ్మద్ సర్దార్ ఖాన్ పేర్కొన్నారు. గురువారం మంథని పట్టణం ప్రముఖ పాఠశాల కాకతీయ పాఠశాలలో జమాతే ఇస్లామిక్ హింద్ తరపున చెట్లు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పర్యావరణ గురించి అవగాహన కల్పించి, మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేసి పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగం కావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు అజీమ్ ఖాన్, జమాతే ఇస్లామిక్ హింద్ ఉపాధ్యక్షుడు మహమ్మద్ వసీయొద్దిన్, జమాతే ఇస్లామిక్ హింద్ సెక్రటరీ అఫ్జల్, ప్రచార సెక్రటరీ మహమ్మద్ అలీమ్ ఖాన్, రుకునె జమాతి ఇస్లామి హింద్ సభ్యులు అఫ్రీన్, నుస్రత్, పాఠశాల యాజమాన్యం ప్రదీప్ రెడ్డి, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ ఆర్థిక నేరలపై అవగాహన



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) ఆర్థిక అక్షరాస్యత కేంద్రం వెడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పాపన్నపేట మండలం చిత్రియల్ గ్రామంలో సైబర్ నేరాలు మోసాలు బ్యాంకింగ్ లావాదేవీలపైన బ్యాంకులలో అందుబాటులో ఉన్నటువంటి సురక్ష బీమా యోజన, జీవన్ జ్యోతి బీమా యోజన ఇన్సూరెన్స్ గురించి వివరించి వారిని ఈ పథకం లో పేరు నమోదు చేసుకోవాల్సింది కోరడమైనది ఈ సందర్భంగా కౌన్సిలర్ నరేష్ మాట్లాడుతూ సైబర్ నేరలపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్ పాపన్నపేట బ్రాంచ్ అధికారి ప్రవీణ్ మరియు కౌన్సిలర్ నరేష్ వంశీ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లాలో సోహం అకాడమీ "రోబోటిక్స్ ఇన్ అకాడెమిక్స్"2025-26 కార్యక్రమం విజయవంతంగా ప్రారంభం



**మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంపై ప్రత్యేక శిక్షణ అందించేందుకు సోహం అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో "రోబోటిక్స్ ఇన్ అకాడెమిక్స్ (RiA)" కార్యక్రమం 2025-26 విద్యా సంవత్సరంలో మెదక్ జిల్లాలోని 5 ప్రభుత్వ పాఠశాలలో విజయవంతంగా నిర్వహించబడింది.

### శిక్షణ పొందిన పాఠశాలలు

1.ZPHS, కుల్చారం - 1332. ZPHS, రంగంపేట - 1423. GGHS, మెదక్ - 1594. ZPHS, మాచవరం - 1345. GNHS, మెదక్ - 147కార్యక్రమంలో భాగంగా, 7, 8, 9 తరగతులకు చెందిన ౹715౹ మంది విద్యార్థులు రోబోటిక్స్ ప్రాథమిక సూత్రాలను నేర్చుకున్నారు. శిక్షణ అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేయబడ్డాయి. అలాగే, పాఠశాలలకు రోబోటిక్స్ కిట్లు అందజేయబడ్డాయి, తద్వారా విద్యార్థులు తమ పరిజ్ఞానాన్ని అభ్యాసంలోకి తీసుకువెళ్లగలుగుతారు. శిక్షణ అనంతరం విద్యార్థులు ఇన్నోవేషన్ ఛాలెంజ్‌లు తీసుకోవడంతో పాటు, స్థానిక మరియు వార్షిక రోబోటిక్స్ ప్రదర్శనల్లో పాల్గొనే అవకాశాన్ని పొందనున్నారు.ఈ పాఠశాలల్లో రోబోటిక్స్ శిక్షణను విజయవంతంగా నిర్వహించడంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మెదక్ విద్యార్థులు మరియు సోహం అకాడమీ నిపుణులు కీలక పాత్ర పోషించారు. ఈ కార్యక్రమం Schrodinger మరియు Rimini Street సంస్థల స్పాన్సర్‌షిప్ తో నిర్వహించబడింది.సోహం అకాడమీ ప్రతినిధులు తెలియజేస్తూ, "రోబోటిక్స్ అనే ఉత్తేజకరమైన ప్రపంచానికి విద్యార్థులను పరిచయం చేయడం, వారి సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించడమే కాక, భవిష్యత్తు సాంకేతిక ఆవిష్కరణల వైపు వారిని నడిపించడమే మా ప్రధాన లక్ష్యం."గత కొన్ని సంవత్సరాలలో సోహం అకాడమీ, తెలంగాణ రాష్ట్రంలోని 23 జిల్లాల్లోని ౹400౹ పాఠశాలల్లో ౹69,647౹ మంది పాఠశాల విద్యార్థులకు మరియు 3,392 మంది డిగ్రీ విద్యార్థులకు రోబోటిక్స్ శిక్షణను అందించింది. రాష్ట్రాన్ని రోబోటిక్స్ విద్యా అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దడంలో అకాడమీ కీలక పాత్ర పోషిస్తోంది.ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన జిల్లా విద్యా అధికారి , జిల్లా విజ్ఞాన అధికారి , పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్వేత పత్రం విడుదల చేసే

# దుమ్ముందా.?:సవాల్ విసిరిన భానుక



**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)** సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో పవన్ విహార్ కాలనీలో నలభై ఆరు లక్షల రూపాయలతో భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభించిన బోర్డు సివిల్ మెంబర్ భానుకనర్మదా.అలాగే గురుపౌర్ణమి సందర్భంగా మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన నామినేటెడ్ సభ్యులు భానుక నర్మదా.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పై శ్వేత పత్రం విడుదల చేయాలని కంటోన్మెంట్ సివిలియన్ నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మదా డిమాండ్ చేశారు.కంటోన్మెంట్ కు భాజపా కేంద్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి పై వారం రోజుల్లోగా శ్వేత పత్రం విడుదల చేస్తామని,దమ్ముంటే కాంగ్రెస్ ఎమ్మెల్యే శ్వేత పత్రం విడుదల చేయాలని సవాల్ విసిరారు.కంటోన్మెంట్ లోని ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి 303 కోట్ల రూపాయల నిధులు తీసుకురావడంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ కృషి ఎనలేనిదని కంటోన్మెంట్ సివిల్ నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద మల్లికార్జున స్పష్టం చేశారు.ఎలివేటెడ్ కారిడార్ కోసం భూములు కోల్పోతున్న కంటోన్మెంట్ సి ల్యాండ్స్ కు పరిహారంగా కేంద్ర రక్షణ మంత్రిత్వశాఖకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన ఆ 303 కోట్ల రూపాయల నిధులను కంటోన్మెంట్ బోర్డుకు మళ్లించి కంటోన్మెంట్ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం వెచ్చించనుందని తెలిపారు. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్ మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ పై మాటల దాడి చేయడం సిగ్గుచేటని అన్నారు.పదేపదే ఈటల రాజేందర్ కంటోన్మెంట్ కు ఏం చేశారని అడిగే ముందు రాష్ట్ర ప్రభుత్వం ఏం చేసిందో ఆత్మ పరిశీలన చేసుకుంటే బాగుంటుందని సవాల్ విసిరారు.టి పి టి బకాయిల విషయంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కంటోన్మెంట్ కు అన్యాయం చేసిందని ఆ విషయం పై మాట్లాడే సత్తా లేని ఎమ్మెల్యే ఎంపీని విమర్శించడం హాస్యాస్పదమని అన్నారు. మల్కాజిగిరి ఎంపీగా పని చేసిన ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిఫెన్స్ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా ఉండి ఎన్ని కోట్ల నిధులు కంటోన్మెంట్ కు తీసుకువచ్చారని ఆమె నిలదీశారు.ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు రాయల్ కుమార్,భానుక మల్లికార్జున్, ప్రేమ్ కుమార్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి పేదల పాలిట వరం

**- ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) కొల్చారం మండల పరిధిలోని గురువారం నాడు నర్సాపూర్ శాసనసభ్యురాలు వాకిటి సునీత లక్ష్మారెడ్డి చేతుల మీదుగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధితులకు 9,30,000 చెక్కుల పంపిణీ చేశారు మరియు కొల్చారం మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు తొమ్మిది లక్షల 30 వేల చెక్కులను గురువారం నాడు అందజేశారు ఈ సందర్భంగా రంగంపేట ఆశ్రమంలో శ్రీశ్రీశ్రీ మాధవ నంద సరస్వతి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు గురువుగారిని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి ఆశీర్వాదం పొందారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల యువజన అధ్యక్షుడు కోనాపూర్ సంతోష్ రావు , రంగంపేట పిఎసిఎస్ చైర్మన్ అరికె రమేష్ , బిఆర్ఎస్ పార్టీ జిల్లా యూత్ ఐకాన్ రవితేజ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు సంతోష్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, కాశీనాథ్, నరేందర్ రెడ్డి, వేమారెడ్డి, వినోద్ నాయక్, రమణ, బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో

# ఘనంగా "గురు పూర్ణిమ" వేడుకలు

**- ప్రత్యేక పూజలు....! అన్నదాన సేవా కార్యక్రమాలు..!!**

**- బీసీ సాధికారత సంఘం ఉమ్మడి జిల్లాధ్యక్షులు: పొలాస నరేందర్**




**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ పట్టణంలోని మార్కండేయ నగర్,తిప్పాపురంలోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయాల్లో గురువారం "గురు పూర్ణిమ" సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అన్నదాన సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి.ఈ



కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకులు,బీసీ సాధికారిత సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు పొలాస నరేందర్ పాల్గొని,ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయిబాబా ఆశీస్సులు తీసుకుని, వేములవాడ పట్టణం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, ప్రజలకు ఆరోగ్యం, సిరిసంపదలు,వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని భగవంతుడిని ప్రార్థించారు.అలాగే సాయిబాబా భక్తులకు, ఆలయ నిర్వాహకులకు గురు పూర్ణిమ శుభాకాంక్షలు తెలియజేస్తూ, భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న కార్యక్రమాలను ప్రశంసించారు. ఈ సందర్భంగా వేములవాడ సేవా సంస్థాన్ ట్రస్ట్ అధ్యక్షులు వారాల దేవయ్య,సభ్యులు బైరి నర్సయ్య, నాగుల రమేష్, కొనమ్మగారి నాగరాజు, శంకర్ లతో పాటు, తిప్పాపూర్ ఆలయ నిర్వాహకులు పర్షరాములు (మాజీ సర్పంచ్), నాగుల విష్ణు, రాకేష్, రాజేశం తదితరులు నరేందర్‌కు శాలువాతో ఘనంగా సన్మానం చేశారు.

## పలు ఆలయాల్లో బీఆర్ఎస్ నేతల ప్రత్యేక పూజలు...దర్శనం



**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** వేములవాడ పట్టణంలోని మార్కండేయ నగర్, తిప్పాపూర్‌లోని సాయిబాబా ఆలయాల్లో బుధవారం గురు పౌర్ణమి ని పురస్కరించుకొని బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గం ఇంచార్జి చల్మెడ లక్ష్మీ నరసింహారావు పలువురు బీఆర్ఎస్ నేతలతో కలిసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయాల్లో స్వామివారికి



శోభాయమానంగా అలంకరణలు చేసి, ప్రత్యేక హారతులు, పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో భాగంగా భక్తులు పెద్దఎత్తున హాజరై దర్శన భాగ్యం పొందారు.చల్మెడ వెంట బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, మాజీ సెస్ డైరెక్టర్ రామతీర్థపు రాజు, మాజీ సర్పంచ్ పోలాస నరేందర్, మాజీ కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్,సిరిగిరి చందు, మారం కుమార్,జోగిని శంకర్,గోలి మహేష్,వాసాల శ్రీనివాస్, కృపాల్, సుంకపాక రాజు, దేవరాజు,పర్వేజ్, సందీప్, రాకేష్, కిరణ్, వినీత్, సాయి పటేల్ తదితరులు పాల్గొన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమాలు భక్తులకు ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని అందించాయి.

# తుమ్మలతో భేటీ,నిధులు పై చర్చించిన మార్కెట్ కమిటీ

కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ బాబు గౌడ్ ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దేవేందర్ కమిటీ సభ్యులు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుని మర్యాదపూర్వకంగా కలిశారు.బోయిన్ పల్లి మార్కెట్ లో మౌలిక సమస్యలు చాలా ఇబ్బందిగా మారాయి.ముఖ్యంగా మార్కెట్లో గత కొన్ని సంవత్సరాలుగా మంచి నీటి సరఫరా లేక కమీషన్ దార్లు కోట్ల రూపాయలు ఖర్చు చేసిన సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా అభివర్ణించారు.జనవరిలో కమిటీ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రధానంగా కమీషన్ ఏజెంట్లు కమిటీ దృష్టికి తీసుకువచ్చిన సమస్య, యుద్ధప్రాతిపదికన కమిటీ స్థానిక సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సిఇవో మధుకర్ నాయక్ ని కలిసి సమస్యను వివరించడంతో మార్కెట్ కి నూతన లైన్ ద్వారా నీటి సరఫరాకి లైన్ క్లియర్ అవుతుంది అన్నారు.అలాగే మార్కెట్ ప్రధాన ద్వారం నుంచి లోపలికి నూతన లైన్ వెయ్యడానికి సుమారు "55"లక్షల పై చిలుకు కర్చు అవుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు.అదిగాక మార్కెట్లో మౌలిక సమస్యలు వల్ల రైతులకు, ఖరీదు దారులకు,కమీషన్ ఏజెంట్లకు,వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భారీ వాహనాలడ్రైవర్లు సిబ్బందికి మరుగు దొడ్లు సరిగ్గా లేకపోవడంతోఇబ్బందులకు గురవుతున్నట్లువ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ రాగిరి ఆనంద్ బాబు.అలాగే ఈ సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని మంత్రిని విజ్ఞప్తి చేశారు.సానూకులంగా స్పందించిన మంత్రి గతంలోనే బోయిన్ పల్లి మార్కెట్ కి చెందిన ప్రతిపాదనలు సిద్ధం చేసి ఆర్థిక శాఖకు పంపినట్లు ఆయన తెలిపారు.తుమ్మలమాట్లాడుతూ ఒక్కసారి కమిటీ ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కను కలవండిఅన్నారు.మరి కొన్ని విషయాలు మంత్రితో చర్చించిన కమిటీ.గతంలోఉమ్మడి ఆంధ్రప్రదేశ్



రాష్ట్రంలో వ్యవసాయ కమిటీలల్లో గుర్తింపు కార్డులు ఉండెవని.ప్రస్తుతం పలు సమావేశాలకు వెళ్లేప్పుడు కార్డులు లేకపోవడం వల్ల సమస్యలు తలెత్తున్నాయి.అందుకని వెంటనే గుర్తింపు కార్డులను మంజూరు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరిన కమిటీ.పలు అంశాల పై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించారు.వైస్ చైర్మన్ తో పాటు కమిటీ సభ్యులకు గౌరవ వేతనాన్ని ఇవ్వాలని కోరారు.రాష్ట్రంలో ఉన్న 162 వ్యవసాయ మార్కెట్ కమిటీలల్లో ఇదే పరిస్థితి.గౌరవ వేతనానికి సంబంధించిన అంశాన్ని ఆర్థిక శాఖ మంత్రితో చర్చించిన అనంతరం నిర్ణయం తీసుకుంటామని మంత్రి సానుకూలంగా స్పందించినట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ బాబు గౌడ్ తెలిపారు.ఈ నేపథ్యంలో మార్కెట్ కమిటీలో ఉన్న మౌలిక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన మరోసారి గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో బోయిన్ పల్లి సెక్రటరీ ఎం వేంకన్న,వైస్ చైర్మన్ దేవేందర్,కమిటీ సభ్యులు నల్లోల రాజేందర్, మహ్మద్ పాషా,అస్లాం,డిసి ప్రభాకర్, దుర్గేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నేను సింగిల్ కాదు

## - విజయ్ దేవరకొండ



టాలెంటెడ్ యంగ్ హీరో విజయ్ దేవరకొండ ప్రస్తుతం కింగ్‌డమ్ సినిమాతో ఆడియన్స్ ముందుకు రాబోతున్నాడు. గౌతమ్ తిన్ననూరి డైరెక్షన్ లో రూపొందుతున్న ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ పై భారీ అంచనాలు ఉన్నాయి. సితార ఎంటర్టైన్మెంట్స్ నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్ షూటింగ్ ఈమధ్యే పూర్తవగా, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. సినిమాను ఈ నెల 31న రిలీజ్ చేయనున్నారు. విజయ్ పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్న ఈ మూవీ టీజర్ ఇప్పటికే మంచి రెస్పాన్స్ తెచ్చుకుంది. ఈ సినిమాలో విజయ్ సరసన భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. హై బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ మూవీ విజయ్ కెరీర్‌లో మరో బిగ్ హిట్ గా నిలుస్తుందనే నమ్మకంతో ఉన్నారు రౌడీ ఫ్యాన్స్. కింగ్‌డమ్ తర్వాత విజయ్ రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో రూపొందే పీరియాడికల్ మూవీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. ఆ సినిమాలో రష్మిక మందన్న హీరోయిన్ గా నటిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇదే కాకుండా మరో ఇంట్రెస్టింగ్ విషయాన్ని విజయ్ స్వయంగా బయటపెట్టాడు. విజయ్ దేవరకొండ ఒక విషయంలో క్లారిటీ ఇచ్చాడు. "నాకు 35 ఏళ్ళు.. ఖచ్చితంగా సింగిల్ కాదు" అంటూ చెప్పేశాడు. దీంతో రష్మికతో ఇప్పటికే వస్తున్న గాసిప్స్ కు బలం చేకూరింది. అయితే విజయ్ మాత్రం రష్మిక పేరును ప్రస్తావించకుండా, పర్సనల్ విషయాల్లో ప్రైవసీకి విలువ ఇస్తానని అన్నారు. విజయ్ ఇలా చెప్పడంతో వీళ్లిద్దరి రిలేషన్ స్టేటస్ గురించి నెట్‌లో మళ్లీ చర్చ మొదలైంది. గతంలో రష్మిక కూడా విజయ్ పై ఓ కామెంట్ చేయడంతో ఈ విషయంపై స్పష్టత ఇవ్వాల్సిందిగా నెటిజెన్లు కామెంట్లు పెడుతున్నారు. అయినా ఇప్పటివరకు ఈ ఇద్దరూ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. మొత్తానికి కింగ్‌డమ్ ప్రాజెక్టుతో పాటు విజయ్ , రష్మిక స్టోరీ కూడా మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. ఈ కాంబో సెట్టయితే రాహుల్ సినిమా పాన్ ఇండియా లెవెల్ లో హైప్ సృష్టించే అవకాశం ఉంది. ఇక విజయ్ పర్సనల్ లైఫ్ పై అఫీషియల్ క్లారిటీ ఎప్పుడు ఇస్తాడో చూడాలి.

# ఆలియా భట్‌కి టోకరా

### రూ. 77 లక్షలు కాజేసిన పీఏ



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ అలియా భట్‌కు భారీ షాక్ తగిలింది. నమ్మిన మనిషే నమ్మక ద్రోహం చేసింది. ఈ బ్యూటీకి పర్సనల్ అసిస్టెంట్ టోకరా వేసి లక్షల్లో డబ్బులు కాజేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి రావడం బాలీవుడ్ లో టాక్ ఆఫ్ డీ టౌన్ గా మారింది. అలియా భట్ వద్ద పర్సనల్ అసిస్టెంట్‌గా వేదికా ప్రకాశ్ శెట్టి పనిచేసేది. ఆమె 2021 నుంచి 2024 వరకు ఆలియా వద్ద పని చేసింది. ఆ సమయంలో ఆలియా పర్సనల్ అకౌంట్స్ తో పాటు ఆమె నిర్మాణ సంస్థ 'ఎటర్నల్ సన్‌షైన్ ప్రొడక్షన్స్' ఆర్థిక వ్యవహారాలను కూడా వేదికానే చూసుకునేదట. అయితే ఇదే అదనుగా భావించిన వేదికా, 2022 మే నుంచి 2024 ఆగస్టు మధ్య కాలంలో ఈ అవకతవకలకు పాల్పడిందని తెలుస్తోంది. వేదికా తప్పుడు లెక్కలు చూపిస్తోందని ఆలియా తల్లి, ప్రముఖ నటి-దర్శకురాలు సోనీ రజ్దాన్ గుర్తించారు. దీంతో ఈ ఏడాది జనవరి 23న జుహు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు చీటింగ్, నమ్మకద్రోహం సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. విచారణలో వేదికా.. తప్పుడు లెక్కలు, నకిలీ బిల్లులు సృష్టించి ఏకంగా రూ.77 లక్షలు కాజేసినట్లు పోలీసులు గుర్తించారు. ప్రయాణాలు, మీటింగ్‌లు, ఇతర ఖర్చుల పేరుతో వేదికా నకిలీ బిల్లులను తయారుచేసి, వాటిపై ఆలియా సంతకాలు తీసుకునేదని తెలిపారు. ఆ బిల్లులను అచ్చం అసలువాటిలా కనిపించేందుకు ప్రొఫెషనల్ టూల్స్ వాడినట్లు తేల్చారు. ఆమోదం పొందిన తర్వాత ఆ డబ్బును తన స్నేహితురాలి ఖాతాకు బదిలీ చేయించి.. అక్కడి నుంచి తిరిగి తన ఖాతాలోకి మళ్లించుకునేది. ఆ మొత్తం డబ్బుల్ని ప్రయాణాలు, మీటింగ్స్, మిగిలిన అరేంజ్‌మెంట్స్ చేయడానికి ఖర్చు చేసినట్లు పోలీసులు వివరించారు.

# 'ది ప్యారడైస్' హై-వోల్టేజ్ యాక్షన్ ఎపిసోడ్



నేచురల్ స్టార్ నాని తన కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ 'ది పారడైజ్' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. శ్రీకాంత్ ఓదెల డైరెక్షన్ లో, %హూం% సినిమాస్ బ్యానర్ కింద సుధాకర్ చెరుకూరి ఈ భారీ బడ్జెట్ మూవీని నిర్మిస్తున్నారు. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో రెండేళ్ల కిందట వచ్చిన దసరా సినిమా ఏ రేంజ్‌లో బాక్సాఫీస్ దగ్గర మాస్ జాతర సృష్టించిందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. కొడితే బాక్సాఫీస్ దగ్గర రూ.100 కోట్ల రీసౌండ్ వినిపించింది. ఇక ఇప్పుడు రెండో సారి వీళ్ల కాంబినేషన్ రిపీట్ కావడం.. అది కూడా పాన్ ఇండియా సబ్జెక్ట్ అవడంతో ఆడియెన్స్‌లో అంచనాలు పీక్స్‌కు వెళ్లిపోయాయి. ప్రస్తుతం 'ది పారడైజ్' షూటింగ్ హైదరాబాద్‌లోని రామోజీ ఫిలిం సిటీ వేగంగా జరుగుతోంది. అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన భారీ సెట్‌లో, ప్రముఖ ఫైట్ మాస్టర్ రియల్ సతీష్ పర్యవేక్షణలో ఒక హై-వోల్టేజ్ యాక్షన్ ఎపిసోడ్‌ను షూట్ చేస్తున్నారు. ఈ ఫైట్ సీన్ కోసం రియల్ సతీష్ మాస్టర్‌తో పాటు, విదేశీ స్టంట్ మాస్టర్స్ కూడా పనిచేస్తున్నారు. ఈ యాక్షన్ సీక్వెన్స్ 'ది పారడైజ్' సినిమాకు హైలైట్‌గా నిలవనుందని మూవీ యూనిట్ చెబుతోంది. 'ది పారడైజ్' నాని కెరీర్‌లో ఒక ముఖ్యమైన మలుపు అవుతుందని, ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను అలరిస్తుందని మేకర్స్ నమ్మకంతో ఉన్నారు. ఈ సినిమా విడుదల కోసం నాని అభిమానులు, సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ నానిని అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్తుందని భావిస్తున్నారు. ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 26న రిలీజ్ కాబోతుంది.

# బాలీవుడ్ పతనాన్ని చూసి జాగ్రత్త పడాలి



ఇప్పుడు జరుగుతున్నది బాగుంది కదా, టెన్షన్ ఎందుకనే ధోరణి పరిశ్రమలో బాగా పెరిగిపోయింది. దీని వల్ల క్వాలిటీ తగ్గిపోయి, ప్యాన్ ఇండియా మోజులో పడి విలువైన టైంని వృథా చేసుకోవడంతో పాటు దారుణమైన డిజాస్టర్లు చవి చూస్తున్న హీరోలు అంతకంతా పెరుగుతూ పోతున్నారు. దీనికి చిన్నా పెద్దా తేడా లేదు. దిల్ రాజు లాంటి అగ్ర నిర్మాతలు ఈ విషయంగా చెబుతున్న కొన్ని కఠిన వాస్తవాలు ఆలోచింపజేసేలా ఉన్నాయి. బాలీవుడ్ పతనాన్ని చూసి మనం జాగ్రత్త పడటం లేదని, మార్కెట్ కిందకు వెళ్లిపోవడాన్ని గుర్తించకపోతే భవిష్యత్ పరిణామాలు తీవ్రంగా ఉంటాయనే సూచన ఒక ఇంటర్వ్యూలో చేశారు. ఆయన చెప్పింది అక్షరాలా నిజం. ఎందుకంటే ఇదే దిల్ రాజు సంక్రాంతికి వస్తున్నాం రూపంలో ఇండస్ట్రీ బ్లాక్ బస్టర్ సాధించారు. కానీ కేవలం ఆరు నెలల కాలంలో గేమ్ ఛేంజర్, తమ్ముడు రూపంలో తీవ్ర నష్టాలు తెచ్చిన సినిమాలు ఇచ్చారు. విక్రమ్ తో కమల్ హాసన్ కంబ్యాక్ అయ్యారు, ఇక తిరుగు లేదని భావించిన వారు ఇండియన్ 2, థగ్ లైఫ్ ఫలితాలు చూశాక మాట్లాడలేదు. కూలీ క్రేజ్ రజనీకాంత్ వల్ల వచ్చిందనుకుంటే మరి లాల్ సలామ్ కు కనీస ఓపెనింగ్స్ ఎందుకు రాలేదు. మెగా 157ని ఎగబడి కొనేందుకు నెలకొన్న ఓటిటి పోటీ విశ్వంభరకు కనిపించలేదు. ఇలా చెప్పుకుంటూ బోలెడు ఉదాహరణలు ప్రత్యక్ష సాక్షాలుగా నిలుస్తాయి. బాలీవుడ్ ఒకప్పుడు గోల్డెన్ ఎరా చూసింది. మాస్, క్లాసు మెచ్చుకునే ఎన్నో గొప్ప క్లాసిక్స్ ఇచ్చారు. కానీ ఇప్పుడు ఏడాది అయిదారు బ్లాక్ బస్టర్స్ ఇవ్వడమే గగనమైపోయింది. హారర్ జానర్ మీద మితిమీరి ఆధారపడుతూ కామన్ ఆడియన్స్ ని పట్టించుకోవడం మానేశారు.

# నో ట్రైలర్.. షాక్ ఇవ్వనున్న కూలీ ?



ఆగస్ట్ 14 విడుదల కాబోతున్న కూలి మీద అంచనాల గురించి మళ్ళీ చెప్పడానికేం లేదు. తమిళనాడు హిస్టరీలోనే అత్యంత పెద్ద ఓపెనింగ్ వస్తుందనే నమ్మకంతో బయ్యర్లు ఎగబడి కొంటున్నారని చెన్నై టాక్. పోటీలో వార్ 2 ఉన్నప్పటికీ రజనీకాంత్ మేనియా ముందు ఎవరైనా నిలవడం కష్టమేనని ఫ్యాన్స్ అభిప్రాయం. కోలీవుడ్ వెయ్యి కోట్ల కలను సాధ్యం చేయబోయే మొదటి సినిమాగా దీని మీద మాములు బజ్ లేదు. అయితే నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ అభిమానులకు ఒక షాక్ ఇవ్వడానికి నిర్ణయం తీసుకుందని ఇన్ సైడ్ రిపోర్ట్. దాని ప్రకారం కూలి నుంచి ఎలాంటి టీజర్, ట్రైలర్ కానీ రావట. నేరుగా థియేటర్లలోనే చూడాలి. ప్రస్తుతం ఈ డెసిషన్ గురించి దర్శకుడు లోకేష్ కనగరాజ్ బృందం తర్జనభర్జనలు పడుతోందని సమాచారం. రజనీకాంత్, నాగార్జున, ఉపేంద్ర, అమీర్ ఖాన్ లాంటి కాంబో చేతిలో ఉన్నప్పుడు ఎలాంటి వీడియో ప్రమోషన్ అవసరం లేదనేది సన్ అధినేతల అభిప్రాయమట. కానీ ఫ్యాన్స్ ఎగ్జైట్ మెంట్ ని కంట్రోల్ చేయడం చాలా కష్టం. ట్రైలర్ భోజనానికి ముందు పెట్టే సలాడ్ లాంటిది. ఎంత పెద్ద స్టార్ హీరో అయినా సరే ఇది చాలా కీలకం. కానీ కూలికి అలా చేయాలని అనుకోవడం వెనుక ఆలోచన ఎవరిదో కానీ ఒకవేళ నిజమైతే మాత్రం రిలీజ్ డేట్ దగ్గర పడే కొద్దీ హైప్ ఎక్కడికో వెళ్ళిపోతుంది. దీనికి సంబంధించిన పూర్తి క్లారిటీ రావాలంటే ఇంకొన్ని రోజులు వేచి చూడాలి. జూలై నెలాఖరున చెన్నై నెహ్రు స్టేడియంలో ప్రీ రిలీజ్ ఈవెంట్ చేయబోతున్నారు. ఒకవేళ అక్కడ లాంచ్ చేస్తే సరే. లేదంటే ఇంక రాదనే అనుకోవాలి. ఆగస్ట్ 7 హైదరాబాద్ లో మరో వేడుక ప్లాన్ చేస్తున్నారని తెలిసింది.

# రాజకీయాల్లోకి కీర్తి సురేశ్.. ?

## విజయ్ పార్టీలోకి వెళ్లే ఛాన్స్



తమిళ రాజకీయాల్లో సరికొత్త సంచలనం సృష్టించిన నటుడు విజయ్., తన పార్టీ 'తమిళగ వెట్రి కళగం' ద్వారా 2026 అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటేందుకు ప్లాన్ చేస్తున్నారు. సినిమా షూటింగ్‌లతో బిజీగా ఉన్నా కూడా, పార్టీ విస్తరణకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. అయితే విజయ్ పార్టీలోకి ఓ స్టార్ హీరోయిన్ ఎంట్రీ ఇస్తుందని కోలీవుడ్ కోడై కూస్తోంది. తనెవరో కాదు.. మహానటి ముద్దుగుమ్మ కీర్తి సురేష్. మదురైలో జరిగిన ఓ కార్యక్రమంలో నటి కీర్తి సురేష్ పాల్గొన్నప్పుడు, అభిమానులు "టీవీకే.. టీవీకే" అంటూ నినాదాలు చేశారు. దీంతో, కీర్తి సురేశ్ 'తమిళగ వెట్రి కళగం' పార్టీలో చేరబోతున్నారనే న్యూస్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ ప్రచారంపై కీర్తి సురేశ్ ఇప్పటివరకు స్పందించలేదు. ఆమె మౌనం ఈ ఊహాగానాలకు మరింత ఆజ్యం పోసింది. దీంతో కీర్తి సురేష్ నిజంగానే విజయ్ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని అభిమానులు, విశ్లేషకులు భావిస్తున్నారు. ఎందుకంటే కీర్తి సురేశ్ విజయ్‌ల మధ్య మంచి ఫ్రెండ్ షిప్ ఉంది.

వీరిద్దరి కాంబినేషన్‌లో రెండు సినిమాలు వచ్చాయి. ఇక కీర్తి సురేశ్ వివాహానికి కూడా విజయ్ స్పెషల్ ఫ్లైట్‌లో వెళ్లి మరి హాజరయ్యారు. దీంతో కీర్తి సురేశ్ విజయ్ పార్టీలో చేరతారనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. పార్టీలో నేరుగా చేరకపోయినప్పటికీ వచ్చే ఎన్నికల్లో కీర్తి సురేశ్ విజయ్‌కు మద్దతు తెలిపే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. మరి ఈ వార్తలపై కీర్తి సురేష్ ఎప్పుడు స్పందిస్తారో వేచి చూడాలి. ఆమె రాజకీయ ప్రవేశం తమిళనాడు రాజకీయాల్లో ఎలాంటి మార్పులు తెస్తుందో చూడాలి.

# వివాదాల 'బ్యాడ్ గర్ల్' వచ్చేస్తోంది



అదేంటి సిద్ధూ జొన్నలగడ్డ బ్యాడ్ యాస్ గురించి ఇవాళ విన్నాం కానీ ఈ బ్యాడ్ గర్ల్ ఎవరనుకుంటున్నారా. ఇది వేరే మ్యాటర్ లెండి. కోలీవుడ్ - బాలీవుడ్ కల్ట్ దర్శకులుగా పేరున్న వెట్రిమారన్, అనురాగ్ కశ్యప్ నిర్మాతలుగా మారి తీసిన ఈ సినిమా టీజర్ వచ్చి ఏడాది దాటేసింది. అయితే కంటెంట్ వివాదాస్పదంగా ఉండటంతో సోషల్ మీడియా వేదికగా తీవ్ర విమర్శలు వచ్చాయి. వర్షా భరత్ అనే మహిళా దర్శకురాలిని ఈ సినిమా ద్వారా పరిచయం చేస్తున్నారు. టైటిల్ రోల్ అంజలి శివరామన్ పోషించగా ఒకప్పటి హీరోయిన్ భానుప్రియ చెల్లెలు శాంతిప్రియ ఈ చిత్రంతో రీ ఎంట్రీ ఇస్తున్నారు. దీని వెనుక ఇంత కథ ఉంది. అప్పటి నుంచే ఈ బ్యాడ్ గర్ల్ సెన్సార్ చిక్కులో పడింది. ఒక కులాన్ని కించపరిచే విధంగా ఇందులో సన్నివేశాలు ఉన్నాయంటూ పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో పాటు అధికారులకు సైతం అదే అనిపించడంతో రిలీజ్ ఆగిపోయింది. ఎట్టకేలకు వాళ్ళు చెప్పిన కట్స్, మార్పులకు ప్రొడ్యూసర్లు ఒప్పుకోవడంతో రూట్ క్లియర్ అయ్యింది. సెప్టెంబర్ 5 బ్యాడ్ గర్ల్ తమిళం తో పాటు తెలుగు, హిందీ, మలయాళంలో రిలీజ్ చేసేందుకు రంగం సిద్ధమవుతోంది. విపరీతమైన కట్టుబాట్లు ఉండే కుటుంబంలో పుట్టి పెరిగిన ఒక అమ్మాయి ప్రేమ, వైవాహిక జీవితంలో జరిగిన ఘటనల ఆధారంగా దీన్ని తెరకెక్కించారు. చెన్నై టాక్ ప్రకారం ఎన్ని కత్తిరింపులు చేసినా బ్యాడ్ గర్ల్ విడుదల తర్వాత కాంట్రావర్సీలు తలెత్తుతాయట. మొన్న ఫిబ్రవరి నెలలో రోస్టర్ డామ్ ఫిలిం ఫెస్టివల్ లో ఈ సినిమాను ప్రదర్శిస్తే అక్కడ ప్రశంసలు అందుకుంది. అయితే సంప్రదాయాల్లో తప్పులను ఎత్తి చూపించే ఇలాంటి కంటెంట్ ని మన ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారో చూడాలి.

# ధర్పల్లి దత్తాశ్రమలో గురు పౌర్ణమి వేడుకలు



**ధర్పల్లి( ప్రశ్న న్యూస్)** నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలో గురు పౌర్ణమి సందర్భంగా 11 రోజులుగా దత్త పారా యణం చేసి ధ్వజారోహణ, యజ్ఞం, చేసి పూజా కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం అన్నప్రసాదం భక్తులందరికీ అందించారు.ఈ కార్యక్రమంలో దత్తాశ్రమ పీఠాధిపతి రమాదేవి, చిలుక శంకర్, మచ్చ బుచ్చన్న, దత్తాశ్రమ కన్వీనర్ మాల్గర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# శంషాబాద్ విమానాశ్రయంలో నకిలీ పత్రాలతో ప్రయాణిస్తున్న యువకుడు

**- అవకాశ్ నకిలీ పేరుతో టిక్కెట్లు, మోసపూరిత పత్రాలు ఉన్నట్లు గుర్తింపు**

**- కేసు నమోదు చేసిన పోలీసులు**



రాజేంద్రనగర్(ప్రశ్న న్యూస్) శంషాబాద్ విమానాశ్రయంలో నకిలీ పాత్రలతో విమాన ప్రయాణం చేస్తున్న యువకుడుని గుర్తించి రిమాండ్ తరలించడం జరిగిందని పోలీసులు తెలిపారు. శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో గురువారం శ్రీ హర్షత్ సింగ్ ఎస్పై ఎక్సైజ్ సిఐఎస్ఎఫ్ ఆర్ జి ఐ ఎయిర్ పోర్ట్ నుంచి అందింన సమాచారం మేరకు ఎయిర్పోర్టులో తనిఖీలు నిర్వహించగా హర్యానాకు చెందిన అమిత్ కుమార్ అనే వ్యక్తి ఆగ్రా నుండి హైదరాబాద్ కు రావడం జరిగిందని, అయితే హైదరాబాదుకు వచ్చి ఇక్కడ శంషాబాద్ ఎయిర్పోర్ట్ నుంచి బెంగళూరు విమానానికి వెళ్లే గేట్ ఎ టి ఆర్ ఎస్ –16, వద్దా భద్రత తనిఖీల్లో తప్పు గుర్తింపు పత్రాలతో విమానం ఎక్కేందుకు యత్నిస్తూ పట్టుబడడం జరిగిందని శంషాబాద్ స్టేషన్ హౌస్ అధికారి బాల్ రాజ్ తెలిపారు. అతని వద్ద తనిఖీలు నిర్వహించగా సదరు వ్యక్తి వద్ద ప్రభుత్వ నియామక పరీక్షల్లో మోసం చేయడానికి ఉపయోగించే బ్లూటూత్ పరికరాలు, కాపీ అయిన ఆధార్ కార్డులు, పాఠశాల సర్టిఫికెట్లు, జింత్ కాలేజ్ రబ్బరు ముద్ర వంటి అనుమానాస్పద వస్తువులు లభ్యమయ్యాయని వాటిని స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా అమిత్ కుమార్ అవకాష్ అనే నకిలీ పేరుతో టికెట్ బుక్ చేసుకుని మోసపూరిత పత్రాలతో బెంగళూరులో జరగనున్న నియామక పరీక్షల్లో కాపీకి సాయపడేందుకు ప్రయాణిస్తున్నట్లు తెలుసుకొని నమోదు చేసి కోర్టుకు హాజరు పరచడం జరిగిందని తెలిపారు. అతనికి న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ పంపడం జరిగిందని, తదుపరి నిందితున్ని పోలీస్ కస్టడీకి తీసుకొని ఇందులో ఇంకా ఎవరెవరు ఉన్నారు అనే విషయం తెలుసుకోవడం జరుగుతుందని విచారణ కొనసాగుతుందని తెలిపారు.

# ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

**- టీడబ్ల్యూజేఎఫ్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి -సైదులు**

**- ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి -నేషనల్ కమిటీ మెంబర్**

**- బి. దేవేందర్**



రాజేంద్రనగర్ (ప్రశ్న న్యూస్) జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టి డబ్ల్యూ జె ఎఫ్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం . సైదులు అన్నారు. గురువారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ( టి డబ్ల్యు జే ఎఫ్ ) రాజేంద్రనగర్ నియోజకవర్గ స్థాయి సమావేశం గండిపేట మండల పరిధిలోని ఖానాపూర్ లో నియోజకవర్గ అధ్యక్షులు ఏ. గోపాల్ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో నేషనల్ కమిటీ సభ్యులు బి. దేవేందర్ పాల్గొన్నారు. యూనియన్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఇ.బుచ్చన్న కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టుల పరిస్థితి రోజురోజుకు దిగజారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జర్నలిస్టుల సంక్షేమాన్ని పట్టించుకోవడంలేదని తెలిపారు. గత ఎన్నికల్లో జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తామని అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ప్రస్తుతం అధికారంలో ఉందన్నారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన ఆ పార్టీ ఇప్పటివరకు ఏ ఒక్క హామీ నెరవేరలేదన్నారు. సమాజంలో ఫోర్త్ ఎస్టేట్ గా పిలువబడుతున్న మీడియా రంగాన్ని పట్టించుకోకపోవడం వల్ల అందులో పని చేస్తున్న జర్నలిస్టుల జీవితాలు ఆగమవుతున్నాయని తెలిపారు. వార్తలు రాసే క్రమంలో జర్నలిస్టులపై అనేకమైన దాడులు జరుగుతున్నాయని వాటిని అరికట్టేందుకు ప్రభుత్వాలు కఠిన చట్టాలు తీసుకురావాలని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెంటనే ఇండ్ల స్థలాలు, కొత్త అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వలేదన్నారు. ఉద్యోగ భద్రత, గౌరవ వేతనం, పెన్షన్ హెల్త్ కార్డులు, పిల్లలకు ప్రయివేటు విద్యాసంస్థల్లో ఫీజు రాయితీ ఇవ్వాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో యూనియన్లకతీతంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. నేషనల్ కమిటీ మెంబర్ దేవేందర్ మాట్లాడుతూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ సభ్యత్వ నమోదు పెంచాలని సూచించారు. తమ హక్కుల సాధన కోసం ఉద్యమాలు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. అధ్యక్ష కార్యదర్శులు ఏ. గోపాల్ ఇ. బుచ్చన్న మాట్లాడుతూ రాజేంద్రనగర్ నియోజకవర్గం జర్నలిస్టుల సమస్యల కోసం ప్రతిపాదించిన పలు తీర్మానాలను కచ్చితంగా అమలు చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కే. సుదర్శన్ గౌడ్, ఎం. శ్రీనివాస్, సలహాదారు కే. యాదయ్య, ఉపాధ్యక్షులు ,ఇ. ప్రభాకర్ , పీ.మాధవాచారి, సహాయ కార్యదర్శులు పి. యాదగిరి, ఎం. శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి ఆర్. జ్ఞానేశ్వర్, ఎం . విజయ్, ఎం. కిట్టు ప్రసాద్, సుధీర్ కుమార్, అనిల్ కుమార్, జీ. శ్రీనివాస్ జీ తదితరులు పాల్గొన్నారు.

# గురుపౌర్ణమి సందర్భంగా వర్ధవెల్లి దత్తాత్రేయ స్వామిని దర్శించుకున్న బీజేపీ నేతలు



**బోయినిపల్లి,(ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలం,వరదవెల్లి గ్రామంలోని ప్రసిద్ద స్వయంభూ శ్రీ దత్తాత్రేయ స్వామివారి ఆలయాన్ని గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డవేణి గోపి మండల భాజపా శ్రేణులతో కలిసి దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.వారి వెంట భాజపా బోయినిపల్లి మండల అధ్యక్షులు ఎడపల్లి పర్శరాం,మాజీ మండల అధ్యక్షులు గుడి రవీందర్ రెడ్డి,నాయకులు నిఖిల్, శ్రీనివాస్,సారంపల్లి రాజు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.ఈ నేపథ్యంలో ఆలయ పరిసరాల్లో భక్తుల రద్దీ కనిపించింది. నేతలు భక్తజనానికి గురు పూర్ణిమ శుభాకాంక్షలు తెలియజేశారు.

# దమ్మాయిగూడలో అక్రమ నిర్మాణాలు ఆపేదెవరు.?

**- దమ్మాయిగూడ మున్సిపాలిటీలో విచ్చలవిడిగా అక్రమ కట్టడాలు**

**- స్థానిక నాయకులకు అధికారులు పెద్ద ఎత్తున అండదండలు**

**- షాడో మున్సిపల్ అధికారిగా చలామణి అవుతున్న దేవరు.?**












దమ్మాయిగూడ( ప్రశ్న న్యూస్) కీసర మండలంలోని దమ్మైగూడ మున్సిపాలిటీ పరిధిలో అక్రమ షెడ్ల నిర్మాణం యదేచ్ఛగా కొనసాగుతున్న ఆపేదెవరు అంటున్న స్టానుకులు. ఎలాంటి అనుమతులు లేకుండా యదేచ్ఛగా భారీ షెడ్డు నిర్మాణం కొనసాగుతుంది. కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు పూర్తి అండదండలతో షెడ్డు నిర్మాణం కొనసాగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇలాంటి అక్రమ షెడ్ల నిర్మాణంతో మున్సిపల్ శాఖకు భారీ నష్టం వాటిలోతోందని తెలిసి వారి స్వలాభం కోసం అధికారులు అక్రమ మార్గంలో సంపాదననే దేయంగా వారి విధులను నిర్వర్తిస్తున్నారని స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ రెవెన్యూ అధికారులు అక్రమ నిర్మాణాలు చేపడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ప్రసంగాలలో తీపి కబుర్లు చెప్పడానికే తప్ప, ఇలాంటి అక్రమ నిర్మాణాలు మామూళ్ల మత్తులో పడి వారి వృత్తి ధర్మాన్ని మరిచారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మధ్యనే అనేక సందర్భాల్లో ఏసీబీ రైడ్ లు జరిగిన సంఘటనలు అయినా ప్రభుత్వ అధికారుల్లో ఎలాంటి మార్పు రాకపోవడం కోసమెరుపు. అధికారులకు స్థానికులు ఇతర నాయకులు ఫిర్యాదులు చేస్తే, నామామాత్రంగా నోటీసుల పేరుతో చేతులు దులుపు కోవడమే తప్ప కావాలని ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. వారి స్వలాభం కోసమే విధులు నిర్వర్తించుకుంటూ ప్రభుత్వ ఆదాయానికి భారీ నష్టం చేకూరుస్తూ తమదైన రీతిలో అక్రమ కట్టడాలను ప్రోత్సహిస్తూ విధులు నిర్వర్తిస్తున్నారని అనడంలో ఎలాంటి సందేహం లేదు. బహుళ అంతస్తు నిర్మాణాలు, పాత గృహాలపై రెండు మూడు అంతస్తులు, ఎలాంటి అనుమతులు లేకుండా స్థానిక నాయకులతో మున్సిపల్ అధికారులు ఒప్పందాలతో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. ఏది ఏమైనా మున్సిపల్ కమిషనర్ అక్రమ కట్టడాలపై, అక్రమ షెడ్ల నిర్మాణాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు ప్రజాసంఘాలు కోరుతున్నారు.

# గాయకుడుపల్లె నరసింహకు ఘన సన్మానం

**- సాంస్కృతిక సలహా మండలి సభ్యులు గా నియామకం తో సిపిఐ నాయకుల అభినందనలు**



రాజేంద్రనగర్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర ప్రజానాట్యమండలి ప్రధాన కార్యదర్శిగా సేవలందిస్తున్న పల్లె నరసింహను రాష్ట్ర ప్రభుత్వం సాంస్కృతిక సలహా మండలి సభ్యునిగా నియమించింది. ఈ సందర్భంగా గురువారం ఆయనను సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా సన్మానించారు.సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, శంషాబాద్ సిపిఐ మండల కార్యదర్శి నర్రగిరి కలిసి పూలబొకే అందజేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.."పల్లె నరసింహ ప్రజల సమస్యలపై కళా రూపంలో పోరాడుతున్న గొప్ప ప్రజానాట్య కళాకారుడు. ప్రజల జీవన స్థితిగతుల్ని సంగీతం, నాటకాల రూపంలో వెలికితీసే గొప్ప సామాజిక కళాకారుడిగా ఆయన సేవలు అపూర్వమైనవి. ఇప్పుడు సాంస్కృతిక సలహా మండలిలో ఆయనకు అవకాశం లభించడం అభినందనీయం. ఇది ప్రజల గొంతుకగా, కళారంగానికి వేదికగా మారుతుంది,"అని అన్నారు.అలాగే, రాష్ట్ర ప్రభుత్వం పల్లె నరసింహ లాంటి ప్రజానాయకులను ఈ స్థాయిలో గుర్తించడం సానుకూల పరిణామమని అభిప్రాయపడ్డారు.

# ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు



**తార్నాక(ప్రశ్న న్యూస్)** లాలాపేట్ హౌసింగ్ బోర్డ్ లోని శ్రీ లక్ష్మీ గణపతి సాయి అయ్యప్ప దేవాలయం లో గురువు పౌర్ణమిని పురస్కరించుకొని ఘనంగా వేడుకలు నిర్వహించారు. ప్రాంగణంలోని సాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుండి లక్ష్మి గణపతి హెూమం, ఆయుష్ హెూమం, సాయి బాబా హెూమం, సాయిబాబాకు పంచామృత అభిషేకములు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పూజలో పాల్గొని షిరిడి సాయి నాథుని ఆశీస్సులు పొందారు. అనంతరం నిర్వహించిన అన్న ప్రసాదం కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, స్థానికులు భక్తులు బాలరాజ్ గుప్తా, రమేష్ గుప్తా గురుస్వామి, ఎల్.ఎల్.బి శ్రీనివాస్, కిషోర్ యాదవ్, పరమేష్ గౌడ్, మహేష్ ముదిరాజ్, బాబా అశోక్, జగన్, పరమేష్ గౌడ్, జగ్గు, మురళీకృష్ణ, గోవర్ధన్ప్రధాన అర్చకులు మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# రోహిన్ రెడ్డిని కలిసిన తోలుపునూరి కృష్ణగౌడ్



**అంబర్ పేట (ప్రశ్న న్యూస్)** అంబర్ పేట్ గౌడ సంఘం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైనతోలుపునూరి కృష్ణగౌడ్ ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రోహిన్ రెడ్డినిమర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రోహిన్ రెడ్డి మాట్లాడుతూ గౌడ సంఘం అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గౌడుల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో టిపిసిసి ఉపాధ్యక్షుడు అఫ్సర్ యూసుఫ్ జాహీ, శ్రీమంత్ గిరి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ రాజరాజేశ్వర విద్యా సంస్థల్లో ఘనంగా "గురు పూజోత్సవం"

**- గురువులకు ఘన నివాళి...! విద్యార్థులలో విశేష ఉత్సాహం...!!**

**- గురువు విశిష్టత,సనాతన ధర్మవైభవాన్ని తెలిపిన ఈఓ : రాధాభాయి**



**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర సంస్కృత విద్యాసంస్థలలో వ్యాస పూర్ణిమ సందర్భంగా గురువారం ఘనంగా గురుపూజోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీ రాజరాజేశ్వర దేవస్థాన కార్యనిర్వాహణ అధికారి రాధాబాయి మాట్లాడుతూ వ్యాసమునీంద్రుని



గొప్పతనాన్ని,గురువు విశిష్టతను వివరించారు. సనాతన ధర్మంలోని గురుత్వానికి ఉన్న ప్రాముఖ్యతను ఆమె సంపూర్ణంగా వివరించారు.అనంతరం రిటైర్డ్ ప్రిన్సిపాల్ శ్రీహరిశర్మ మాట్లాడుతూ, విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పిలుపునిచ్చారు. పూర్వ విద్యార్థి కొంకటి సుభద్ర బాలకిషన్ కూడా గురువుల మాటలను మనస్సులో పెట్టుకొని ముందుకు సాగాలని విద్యార్థులకు ఉద్దేశించి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో చదువులో ప్రతిభ కనబరిచిన పదిమంది విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేసి ప్రోత్సహించారు.తదుపరి విద్యాసంస్థల ఏఈఓ జయకుమారి మాట్లాడుతూ, విద్యార్థులు చదువుపట్ల నిబద్ధతతో ఉండాలని సూచించారు.ఈ సభకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డా. ఆవుల మల్లారెడ్డి మాట్లాడుతూ, పూర్వ విద్యార్థుల విజయగాథలు ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని తెలిపారు. విశిష్ట అతిథులుగా సముద్రాల వేణుగోపాలచార్యులు, ఎర్రోజు వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్ రమాదేవి పాల్గొన్నారు. అలాగే కార్యనిర్వాహణ ఏఈఓ జయకుమారి, సూపరింటెండెంట్ శ్రీనివాస్ శర్మ, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు కూడా ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు చల్మెడ పరామర్శ..! ప్రగాఢ సంతాపం..!!



**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** వేములవాడ పట్టణానికి చెందిన నాయకులు నేరెళ్ల పండు తండ్రి నేరెళ్ల పురుషోత్తమ చారి ఇటీవల మృతిచెందగా,అలాగే పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయులు గుమ్మడి శ్రీనివాస్ మాతృమూర్తి గుమ్మడి అనసూర్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను గురువారం బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గం ఇంచార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పరామర్శించి, ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. వారి వెంట బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి,నాయకులు రామతీర్థపు రాజు,మాజీ కౌన్సిలర్లు నరాల శేఖర్,గోలి మహేష్,నిమ్మశెట్టి విజయ్, సిరిగిరి చందు,జోగిని శంకర్, ముద్రకోల వెంకన్న,నరాల దేవేందర్,కృపాల్,దేవరాజు, సుంకపాక రాజు, తదితరులు ఉన్నారు.



# కష్టజీవుల జీవితాలను కాటేస్తున్న కల్తీకల్లు

## అవినీతి మత్తులో తూగుతున్న అధికారులు

**సహజసిద్ధమైన తాటి, ఈత చెట్ల నుంచి తీసే స్వచ్ఛమైన కల్లుకు బదులుగా నిషేధిత మత్తు పదార్థాలతో తయారు చేస్తున్న కల్తీ కల్లు కష్టజీవుల జీవితాలను కాటేస్తోంది, సంవత్సరాల తరబడి కృత్రిమ కల్తీ కల్లు తాగుతున్న వారు ఎముకల గూడులా, జీవచ్ఛవంలా తయారవుతున్నారు. ముఖ్యంగా కృత్రిమ కల్లు తయారిలో మత్తుకోసం క్లోరోఫాం, అల్పాజోలం డైజోఫాం వంటి భయంకర మందులను వాడుచుండడంతో చాల మంది వణికి పోతున్నారు. ఈ మందులకు మామూలు మనుషులను కూడా సైకోలుగా మార్చే శక్తి ఉంది. ఇదే ఇప్పుడు వందలాది కుటుంబాలకు శాపంగా పరిణమించింది. మనుషులను నిద్రపుచ్చడానికి పనికి వచ్చే ఈ కల్తీకల్లుతో ఎన్నో జీవితాలు మోడుబారుతున్నాయి.**

- వ్యాపారుల కాసుల కక్కుర్తే కల్లు కల్తీకి కారణం
- కల్తీకల్లు విక్రయాలకు ఎక్సైజ్ అధికారుల అండదండలతో రెచ్చిపోతున్న దళారులు
- వ్యాపారంలో పోటీని తట్టుకునేందుకే మందు మోతాదు పెంపు
- కల్తీకల్లు మత్తురుచికి భానిసలవుచున్న కష్టజీవులు
- కల్తీకల్లుతో ఎముకల గూడుగా మారుచున్న అభాగ్యులు. కిడ్నిల పనితీరుపై తీవ్ర ప్రభావం
- సాధారణ మానవులను సైతం సైకోలుగా మార్చే కల్తీ కల్లు
- కల్తీకల్లుతో మోడుబారుతున్న బడుగుల బ్రతుకులు

**(ఆర్ కె - ప్రశ్న న్యూస్ బ్యూరో)**

కృత్రిమ కల్లు వ్యాపారం ఒక పెద్ద మాఫియాగా మారింది. ఈ మత్తు పదార్థాలు మోతాదుకు మించి కల్లులో కలపడంతో ఈ మందుకల్లు మత్తు రుచికి అలవాటు పడిన వారు దీనికి పూర్తిగా బానిసలై పోతున్నారు. ఇటీవల జరుగుచున్న సంఘటనలే ఇందుకు సాక్ష్యం. కష్టజీవుల శారీరక శ్రమను మరపించాల్సిన కల్లు, కలుషితమై ప్రాణాలనే హరిస్తుంది. అలాగే శరీరంలోని అవయవాల పని తీరును దెబ్బతీస్తు లోలోపల కోలుకోలేని విధంగా కాటేస్తుంది. ముఖ్యంగా కూలీనాలి చేసుకుని కుటుంభాలను ఈడ్చుకొస్తున్న పేదలు కల్తీకల్లుకు అలవాటు పడి ఆసుపత్రుల పాలై ఆర్థికంగా మరింత చితికిపోతున్నారు. ఇలాంటి దారుణాలకు కల్లు విక్రయించే వ్యాపారుల అత్యాశ ఒక కారణమైతే, మరోవైపు కాసులకు కక్కుర్థి పడే ఎక్సైజ్ శాఖ మరో కారణం. రాష్ట్రంలోని నగరాల నుండి గ్రామీణ ప్రాంతాలలో ఈ కల్తీకల్లు బారినపడి ఎంతో మంది ఆసుపత్రుల పాలవ్వడమే కాక ప్రాణాలు కోల్పోయిన సంఘటనలెన్నో ఉన్నాయి. కల్తీకల్లు కిడ్నీల పనితీరుపై తీవ్ర ప్రభావం చూపుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. గ్రామాలలో ఒకటి లేదా రెండు కల్లు దుకాణాలకు మాత్రమే అనుమతులు ఉన్నప్పటికి అక్రమంగా ఎన్నో దుకాణాలు కొనసాగుతున్నప్పటికి పట్టించుకునే వారు కరువైన్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో పుట్టుక నుంచి చావు వరకు ఏ సందర్భమైనను అధిక ప్రాధాన్యత కల్లుదే. దీంతో జనాల బలహీనతను ఆసరాగా చేసుకున్న కల్లు వ్యాపారులు తమ ఇష్టానుసారంగా కల్లు దుకాణాలు తెరిచి విచ్చలవిడిగా కల్తీకల్లు విక్రయాలు చేస్తున్నారు.

### కల్తీకల్లు వ్యాపారానికి ఎక్సైజ్ అధికారుల అండ

రాష్ట్రవ్యాప్తంగా కల్తీకల్లు దందా వ్యాపారులకు కాసులు కురిపిస్తోంది. ఎక్కడి కల్లును అక్కడే విక్రయించాలనేది నిబంధనలు ఉన్నప్పటికి ఒక ప్రాంతంలోని కల్లును అక్కడే విక్రయించిన సందర్భాలు లేవు. కల్లు డిపోలు ఏర్పాటు చేసి ఆయా గ్రామాలకు రోడ్డుమార్గం ద్వారా కల్లు తరలిస్తు వ్యాపారం చేస్తుండగా ఈ డిపోల నుంచి సరఫరా చేసిన కల్లు వల్లనే ప్రజలు అవస్థలు పడ్డుచున్నారని సమాచారం.

### వ్యాపారంలో పోటీని తట్టుకునేందుకే మందు మోతాదు పెంపు

కల్లు వ్యాపారంలో పోటీని తట్టుకుని ఎక్కువ సంఖ్యలో కల్లు ప్రియులను ఆకర్షించేందుకే కల్లులో కల్తీ మోతాదును పెంచుతున్నట్లు సమాచారం. కల్లు భానిసలైన వారిలో ఎక్కువ శాతం కష్టజీవులే ఉండడం గమనార్హం. పొద్దంతా ఒళ్ళు హూనమయ్యేలా కాయకష్టం చేయడంతో ఆలసట, ఒళ్లు నొప్పుల నుండి ఉపశమనం పోందేందుకు అందుబాటులో దొరికే కల్లును తాగేందుకు అలవాటు పడి తక్కువ ఖర్చుతో ఎక్కువ మత్తును పొందాలనుకొని కల్తీ కల్లుకు భానిసలుగా మారి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఎన్ని సీసాల కల్లు తాగినను మత్తు ఎక్కట్లేదని, మందు తక్కువ కలుపుతున్నావంట దుకాణాదారులతో గొడవలు పడుచున్న సందర్భాలు అనేకంగా ఉన్నాయి. అయితే జనాలు ఎక్కవ మత్తును కోరుకుంటున్నారనే విషయం పసికట్టిన కొందరు కల్లు దుకాణాదారులు నిర్ణీత మోతాదుకు మించి మత్తు పదార్థాలను కలుపుతున్నట్లు సమాచారం. అయితే మానవుల ఆరోగ్యంపై అధిక ప్రభావం చూపే డైజోఫాం కల్లులో కలిపే విషయంలో అనుభవం కలిగిన వారు మాత్రమే జాగ్రత్తగా ప్రమాద సూచిక దాటకుండా కలుపుతారని, అనుభవం లేని వారివల్లనే ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటాయని విమర్శలు వస్తున్నాయి

### గట్టిగా తనిఖీలు చేస్తే సగానికి పైగా మూతపడతాయి

అధికారులు ప్రణాళికాబద్దంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తే సగానికి పైగా షాపులు మూతపడతాయని పలువురు కల్లు వ్యాపారులే తెలపడం గమనార్హం. అకస్మిక తనిఖీలు చేస్తు కల్తీకల్లు విక్రయించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటే కల్లును కల్తీ చేయకుండా అమ్మకాలు జరుగుతాయని ప్రజలు తమ అభిప్రాయాన్ని వెళ్ళబచ్చుతున్నారు. కల్తీ కల్లుపై ఎన్ని స్పెషల్ డ్రైవ్ లు నిర్వహించిన, కల్తీ జరిందని ల్యాబ్ టెస్టులో తేలినను తమకు జరిగే నష్టం ఏంలేదని పలువురు కల్లు వ్యాపారులు బాహటంగా సెలవిస్తున్నారు. దీనికి కారణం క్రమం తప్పకుండా ముడుపులు తీసుకునే అధికారులు, తమకు తనిఖీల సమాచారం ఇవ్వకుండా ఎప్పుడు రారని, వచ్చినను మా దగ్గర వారికేం దొరకదని చెపుతున్నారు. ఓ పక్క కల్తీకల్లు అమ్ముతున్నాను శాంపిల్ కోసం పక్కకు తీసి ఉంచిన కల్లునే వారు టెస్టుల కోసం తీసుకెళతారని భయంకర నిజాన్ని చెప్పడం గమనార్హం. అయితే ముడుపులు సరిగా ఇవ్వని వారిలో ఎవరో ఒకరిని ఇబ్బందులకు గురిచేసి, వారిపైనే కేసులు నమోదు చేస్తారని అసలు నిజాన్ని చెప్పడం గమనార్హం.

### కల్తీకల్లు అరికట్టెందుకు ముందు ఇంటి దొంగల భరతం పట్టాలి

రోజు రోజుకు కల్లుకు బానిసలుగా మారే సంఖ్య బారీగా పెరుగుతుండడం గమనార్హం. దీంతో కల్లుదందా చేసే వ్యాపారులు కాసుల కక్కుర్థితో కల్లును భయంకరమైన మందులతో కల్తీ చేసి విక్రయించడంతో కల్తీ కల్లు మత్తుకు భానిసలైన శ్రమజీవులు అనారోగ్య సమస్యలకు గురికావడమే కాక ప్రాణాలను సైతం కోల్పోతుండడం విచారకరం. అయితే ఈ తతంగమంతా సంబందిత అధికారుల కనుసన్నలోనే జరుగుచుండడం గమనార్హం. కల్తీకల్లును అరికట్టాల్సిన అధికారులే కల్లు విక్రయించే వ్యాపారులకు తమ అండదండలందించి సహకరిస్తుండడంతో కల్తీకల్లు ఏరులై పారుతుంది. ప్రభుత్వ వెంటనే స్పందించి అవినీతి అధికారుల భరతం పట్టి కల్తీకల్లును అరికట్టాలని కోరుచున్నారు.

### కల్లు ఉత్పత్తిపై కచ్చితమైన లెక్కలు తీయాలి

రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి రోజు ఎంత కల్లు ఉత్పత్తి అవుతుంది, ఎంత కల్లు విక్రయిస్తున్నారనే కచ్చితమైన లెక్కలు తీస్తే కల్తీకల్లు భాగోతం బయట పడుతుంది. మాధక ద్రవ్యాల (డ్రగ్స్) విషయంలో గట్టి నిఘ పెట్టిన ప్రభుత్వం కల్తీకల్లుపై ఎందుకు నిర్లక్ష్యం చూపుతుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి కల్తీకల్లు విక్రయాలపై దృష్టి సారించి కల్తీరాయుళ్ళు, వారికి సహకరిస్తున్న సంబందిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోని కలీకల్లును పూర్తి స్థాయిలో అరికట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# అక్రమ షెడ్‌లపై చర్యలేవి.?

## - స్థానికులు ఫిర్యాదు చేసిన పట్టించుకోని అధికారులు - అక్రమ షెడ్లతో ట్రాఫిక్ సమస్యలు





**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** కంటోన్మెంట్ నియోజకవర్గం 6వ వార్డు సీతారాం పురంలో సర్వే నెం1లోని కాళీ స్థలంలో ఎటువంటి అనుమతులు లేకుండా షెడులు ఏర్పాటు చేసి నప్పుడు అధికారుల దృష్టికి తీసుకువెల్లిన కూడా కంటోన్మెంట్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు ఏకంగా అవ్వే షెడ్ లలో వాణిజ్య కార్యక్రమాలు జరిపినా కూడా పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. ఈ అక్రమ షెడ్ లలో సాగుతున్న వ్యాపారంతో అక్కడికి వస్తున్న వాహన దాడులు రోడ్డుపైనే వాహనాలు నిలపడంతో ప్రతి రోజు ట్రాఫిక్ సమస్యలు ఏర్పడి వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడం జరుగుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ అక్రమ షెడ్ ల కారణంగా ప్రభుత్వ రాబడికి కూడా గండి పడుతుందనే విషయం అధికారులకు అర్థం కావడం లేదా,? లేక ఆమ్యామ్యాలకు అలవాటు చూసి చూడనట్లు వదిలేస్తున్నారా అని ప్రశ్నిస్తున్నారు. ఫుట్ పాత్ లపై పొట్టకూటి కోసం వ్యాపారం చేసుకుంటున్న తమపై ప్రతాపం చూపిస్తున్న ట్రాఫుక్ పోలీసులకు, అధికారులకు ఇవ్వి కనిపించడం లేదా అని చిరు వ్యాపారులు అడుగుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవడం ద్వారా ప్రజల అనుమానాలను నివృత్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు. లేని యెడల సీఈఓ తో పాటు హైడ్రా కమిషనర్ కు కూడా పిర్యాదు చేస్తామని స్పష్టం చేస్తున్నారు.

## నాగారం మునిసిపల్ పరిధిలో

# అక్రమ నిర్మాణాలు

- అక్రమ నిర్మాణాలతో ప్రభుత్వ ఆదయానికి గండీ
- మునిసిపల్ అధికారుల ఎవరి వాటా ఎంత.?
- ప్రభుత్వ కార్యాలయాలలో పనిచేసే అధికారులలో మార్పులు పట్టించుకోని ఉన్నతాధికారులు





నాగారం(ప్రశ్న న్యూస్) నాగారం మున్సిపల్ పరిధిలో యదేచ్చగా కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలు పట్టించుకోని మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు ఎవరి వాటా ఎంత అన్న అనుమానాలు రెతేకిస్తున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే నాగారం మున్సిపల్ పరిధిలో విచ్చలవిడిగా ప్రధాన రహదారిలో అక్రమ నిర్మాణాలు కొనసాగుతుంటే మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు పెద్ద ఎత్తున ఆరోపిస్తున్నారు. మున్సిపల్ లో పాలకవర్గం లేకపోవడంతో మున్సిపల్ అధికారులు ఆడిందే ఆట పాడిందే పాట అన్న విధానంతో అక్రమ నిర్మాణాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయని స్థానికులు తెలిపారు. నాగారం నుండి ఘట్కేసర్ వెళ్లే ప్రధాన రహదారిపై ఎలాంటి అనుమతులు లేకుండా విచ్చలవిడిగా అక్రమంగా నిర్మాణాలు కొనసాగుతున్నాయని ఇలాంటి వాటిని టౌన్ ప్లానింగ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఇలా అయినట్లయితే ప్రభుత్వానికి పెద్ద ఎత్తున నష్టం వాటిల్లుతుందని అధికారులు పెద్ద మొత్తంలో ముడుపులు తీసుకుని అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్నారని స్థానికులు ఆరోపించారు. ఇలాంటి అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకొనట్లయితే ఉన్నతాధికారులు పరిశీలించి అక్రమ నిర్మాణాలను నివారించాలని ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుకుంటున్నారు. స్థానికులు ఎన్ని ఫిర్యాదులు చేసినా పత్రికలో కథనాలు వచ్చిన అధికారులు మామూళ్లు తీసుకొని చర్యలు తీసుకోవడం లేదని అధికారుల అవినీతి దాహానికి ప్రభుత్వం భారీగా నష్టపోతుందని స్థానికులు మండిపడుతున్నారు. అక్రమ నిర్మాణాలపై అధికారులు, ఉన్నతాధికారులు ఏ మేరకు చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## జహీరాబాద్ నిమ్జ్‌లో

# లంచం తీసుకుంటూ ముగ్గురు అరెస్ట్

- ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్, డిప్యూటీ తహసీల్దార్, డ్రైవర్ పట్టివేత
- రూ. 50 వేలు డిమాండ్, రూ. 15 వేలు తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** పని పూర్తి చేసి, పరిహారం చెక్కు చేతికిచ్చిన తర్వాత కూడా లంచం కోసం వేధించిన ప్రభుత్వ అధికారుల బండారాన్ని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు బయటపెట్టారు. ఓ బాధితుడి నుంచి లంచం తీసుకుంటుండగా ఇద్దరు ముఖ్య అధికారులను, ఒక డ్రైవర్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో కలకలం రేపింది. జహీరాబాద్‌లోని జాతీయ పెట్టుబడులు, తయారీ మండలం (నిమ్జ్) కోసం ప్రభుత్వం భూసేకరణ చేపట్టింది. ఈ క్రమంలో ఓ వ్యక్తికి చెందిన భూమిని సేకరించి, దానికి సంబంధించిన ఫైల్‌ను అధికారులు ప్రాసెస్ చేశారు. బాధితుడికి రూ. 52,87,500 పరిహారం చెక్కును కూడా అందజేశారు. అయితే, ఈ పని చేసినందుకు గాను నిమ్జ్ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న రాజారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ సతీష్, వారి డ్రైవర్ దుర్గయ్య కలిసి బాధితుడిని రూ. 50,000 లంచం డిమాండ్ చేశారు.దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు... బేరసారాల అనంతరం రూ. 15,000 ఇచ్చేందుకు అంగీకరించాడు. గురువారం నాడు బాధితుడి నుంచి రూ. 15,000 లంచం తీసుకుంటుండగా, ముందుగా వేసిన పథకం ప్రకారం ఏసీబీ అధికారులు లంచగొండి అధికారులను పట్టుకున్నారు. ఈ ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీబీ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం అడిగితే తమ టోల్ ఫ్రీ నంబర్ 1064కు గానీ, వాట్సాప్ (9440446106) ద్వారా గానీ సమాచారం ఇవ్వాలని ఏసీబీ అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

## రేవంత్ రెడ్డి ప్రభుత్వ నిర్ణయంపై

# ఎమ్మెల్సీ కవిత హర్షం

- తెలంగాణ కేబినెట్ నిర్ణయాన్ని స్వాగతించిన ఎమ్మెల్సీ కవిత
- చట్ట సవరణ తర్వాతే ఎన్నికలు జరపాలని ప్రభుత్వం నిర్ణయం
- ఇది బీసీల విజయమని అభివర్ణించిన కవిత
- తెలంగాణ జాగృతి పోరాట ఫలితమేనని వెల్లడి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్వాగతించారు. ఈ మేరకు గురువారం ఆమె 'ఎక్స్' వేదికగా తన స్పందనను తెలియజేస్తూ ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాన్ని సవరించి బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్న ప్రభుత్వ వైఖరిని ఆమె ప్రశంసించారు. ఈ దిశగా అవసరమైన చర్యలను ప్రభుత్వం తక్షణమే ప్రారంభించాలని ఆమె కోరారు. ఈ నిర్ణయం తెలంగాణలోని బీసీల విజయమని కవిత అభివర్ణించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని తెలంగాణ జాగృతి సంస్థ మొదటి నుంచి బలంగా డిమాండ్ చేస్తోందని, కేబినెట్ తాజా నిర్ణయం తమ పోరాటానికి లభించిన స్పష్టమైన విజయమని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా కవిత జై బీసీ, జై జాగృతి అనే నినాదాలను తన ట్వీట్ కు ట్యాగ్ చేశారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati